

బొజ్జగణపయ్యా.. వెళ్లిరావయ్యా!

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి బొజ్జగణపయ్య ఈ ఏడాదికి వెళ్లి.. మళ్లీ ఏడాది వస్తానంటూ నిమజ్జన ఘట్టానికి సిద్ధమయ్యాడు. గత నెల 27 నుంచి గణేష్ నవరాత్రులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ రోజున, 3, 5 రోజుల్లో నిమజ్జనాలు జరిగాయి. అయితే గురువారం 9వ రోజు కావడంతో నిమజ్జనాలు భారీ సంఖ్యలో ఉండే అవకాశం ఉంది. ఆదివారం గ్రహణం, రేపు శుక్రవారం కావడంతో గురువారం పెద్ద సంఖ్యలో నిమజ్జనానికి ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. బుధవారం 8వ రోజు కావడంతో నిజమజ్జనాలు దాదాపుగా జరగలేదనే చెప్పవచ్చు. జిల్లాలో 3 వేల విగ్రహాలను పోలీసుల వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదు చేసి ఏర్పాటు చేయగా, మరో 2 వేల విగ్రహాలు అనధికారికంగా ఉంటాయి. వీటిలో బుధవారం వరకూ వెయ్యి విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఇంకా మిగిలిన 4 వేల విగ్రహాల్లో అధిక శాతం గురువారం నిమజ్జనం చేసే అవకాశం ఉంది. విగ్రహాల ఊరేగింపులకూ భారీగానే సిద్ధమవుతుండడంతో ఇటు పోలీసులు కూడా భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిబంధనలు మీరవద్దు : ఎస్పీ

జిల్లాలో గణేష్ నిమజ్జనం, ఊరేగింపులను గూగుల్ మ్యాప్‌ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ నర సింహ కిశోర్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమీక్షించారు.ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపరీతంగా హోరెత్తించే సౌండ్ ఉండే డీజేలను అనుమతించవద్దని ఆదేశించారు.పోలీసులు కేటాయించిన దారుల్లోనే నిమజ్జన వాహనాలు వెళ్లాలని సూచించారు. పోలీసుల నిబంధనలు పాటించాలని, నిమజ్జన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు.

కళ్లు తెరిచే గణనాథుడు..

కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో 23 అడుగుల భారీ వినాయకున్ని ఏర్పాటు చేశారు. దర్శించుకోవడానికి వచ్చిన భక్తులను వినాయకుడు కనురెప్పలు మూస్తూ, తెరుస్తూ ఆశీర్వదిస్తూ అందరినీ అలరిస్తున్నాడు. - కొవ్వూరు

జిల్లాలో కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జిల్లాలోని పలువురు నేతలకు నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టింది. వివిధ కార్పొరేషన్లకు జిల్లాకు చెందిన పలువురిని డైరెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజమండ్రి రూరల్‌కు చెందిన వడగల వీర వెంకట బుచ్చిరాజును నియమించింది. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనపర్తికి చెందిన బేరా వేణమ్మను నియమించారు. ఏపీ కుమ్మరి శాలివాన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజమండ్రి రూరల్‌కు చెందిన పండూరి అప్పారావు, దలిపర్తి వేమన్నలను, నాటక అకాడమీ డైరెక్టర్‌గా రాజమండ్రికి చెందిన గంగాలపల్లి వెంకటరమణ, రాజానగరం నియోజకవర్గానికి చెందిన మద్దాల ఏసుపాదం, నిడదవోలుకు చెందిన వెలిగట్ల ఎస్‌వీఎ.లక్ష్మిని నియమించారు. ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజమండ్రికి చెందిన అఫ్సిర్ సయ్యద్, నిడదవోలుకు చెందిన షేక్ ముంతాజ్‌బేగం,ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ మిషన్ డైరెక్టర్‌గా కోరశిఖ చంద్రమౌళి (నిడదవోలు), ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ముత్యాల ప్రియ సౌజన్య(రాజమండ్రి)ని నియమించారు.

ప్రమాదకరమైన జ్వరం కాదు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజోతి) : జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న జ్వరాల కేసులు అంత ప్రమాదకరం కాదని డీఎంహెచ్‌వో డా కె.వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. జ్వర పీడితులు పెరిగితే ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ మార్పు వల్ల ప్రస్తుత కాలంలో రొంప, జలుబుతో జ్వరాలు, వంటి నొప్పులతో కూడిన జ్వరాలు ఉన్నాయని వాటికి మందులు ఉన్నాయని తెలిపారు. వేగేశ్వరపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ పరిశీలించారు.



శవాలతో బేరం!

జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌ల దందా

అర్ధరాత్రి వేళ.. రంపచోడవరానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని కేవలం 53 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ ఊరికి తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్సుల వాళ్లు రూ.18వేల కిరాయి అవుతుందన్నారు. అంతే బాధితుల గుండె ఆగినంత పనైంది.

నగరానికి చేరువలో ఉన్న ఓ గ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఏకంగా రూ.6 వేల కిరాయి చెప్పగా సదరు కుటుంబీకుల వద్ద అంత మొత్తం లేకపోవడంతో ర్యాపిడో ఆటో పిలిపించుకున్నారు. అంతే.. ఆటో డ్రైవరు, బాధిత కుటుంబంపై కూడా అంబులెన్స్ డ్రైవర్లు దాడికి దిగారు. పోలీసులు కల్పించుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్‌ల తీరు చూసి రాబందులు కూడా ఆవేదన చెందుతున్నాయి. రాబందులకైనా కాస్త కనికరం ఉంటుందేమో కానీ ప్రైవేటు అంబులెన్సులకు వీసమెత్తు జాలి లేకపోవడంతో దోపిడీ తిష్ట వేసింది. జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద గేటు బయట రోడ్డుపై అటూ ఇటూ సుమారు 20 వరకూ ప్రైవేటు అంబులెన్సులు ఉంటాయి. రాత్రీపగలు ప్రైవేటు అంబులెన్సులు రాబందుల అవతార మెత్తుతున్నాయి. డ్రైవర్లు ఆస్పత్రి ఉద్యోగుల సీట్లలో దర్జాగా కూర్చుని బేరాలకు ఎదురు చూస్తుంటారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి అటు ఏజెన్సీ, ఇటు హైవే వైపు నుంచి సుమారు 200 గ్రామాల ప్రజలు వేలాదిగా వస్తారు. హైవేను ఆనుకొని ఉండడం వల్ల ప్రమాద కేసులు రాత్రి వేళల్లో ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి రోజూ సుమారు 10 మరణాల కేసులు నమోదవుతుంటాయి. ఇదే అదనుగా ఆస్పత్రిలో ఉద్యోగుల మాదిరిగా తిష్ట వేస్తున్న అంబులెన్స్ డ్రైవర్లు దోపిడీకి తెరతీశారు.

స్కానింగ్ రాస్తే సంబరమే

ఎంఆర్‌ఐ, స్కానింగ్, ఎక్స్‌రే తదితర పరీక్షలకు ప్రభుత్వం దానవాయిపేటలోని ఒక ప్రైవేటు సంస్థతో ప్రభుత్వాస్పత్రి ఒప్పందం కుదుర్చుకుంది.ఇది కూడా ప్రైవేటు అంబులెన్స్‌లకు వరంగా మారింది. ఎవరికైనా వైద్యులు స్కానింగ్ రాస్తే ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లకు ఫోన్ వెళ్లిపోతుంది. వాళ్లు వచ్చి బేరాలకు దిగుతారు. రెండు కిలోమీటర్లు కూడా ఉండని దానవాయిపేటకు కిరాయి కనీసం రూ2 వేల నుంచి మొదలు పెడతారు. ఆస్పత్రికి మూడు అంబులెన్స్‌లున్నా లోకల్‌గా స్కానింగ్‌కి ప్రైవేటు అంబులెన్సులపై బాధితులు ఆధార పడడం చూస్తుంటేమాఫియా వేళ్లానుకుపోయినట్లు చెప్పకతప్పదు.



ఆసుపత్రి సిబ్బందికి మామూళ్లు..

ఆస్పత్రిలో పగలూరాత్రి ప్రైవేటు అంబులెన్స్‌ల తంతు దారుణంగా మారిపోయింది. శానిటరీ సిబ్బంది, ఏఎన్ఎంలు వంటి కిందిస్థాయి సిబ్బందితో అంబులెన్స్‌ల మాఫియా మీకింత మాకింత అనే స్థాయిలో సంబంధాలు పెట్టుకొంది. ఎవరైనా చనిపోయినా, లేక కాసేపటిలో చనిపోతారనగా అంబులెన్స్‌ల డ్రైవర్లకు ఫోన్ వెళుతుంది. అంతే వాళ్లు నేరుగా లోపలికి వచ్చి బేరం కోసం ఎదురు చూస్తుంటారు. ఒకవేళ వీళ్లకు సమాచారం అందకుండా..మృతదేహాన్ని బయటికి తీసు కొస్తే చుట్టూ రాబందుల్లా మూగిపోతారు. కిరాయిలకు ఒక పద్ధతి, నిర్ధారణ లేకపోవడంతో వేల రూపాయల కిరాయి చెబుతారు. దాంతో అప్పటికే తమ వారు మృతి చెందిన బాధలో ఉన్న కుటుంబీకుల గుండె గుభేల్‌మంటోంది. ప్రభుత్వాస్పత్రికి పేదవాళ్లే వస్తుంటారు. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిని దోపిడీ చేయడానికి బేరసారాలు సాగిస్తారు.

రాత్రి వేళ... మహా ప్రస్థానం కదుళ

జిల్లా పరిధిలో ఎక్కడికైనా మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి నుంచి ఉచితంగా తరలించడానికి మహా ప్రస్థానం వాహనాలు ఉన్నాయి. ఇవి ప్రభుత్వ ఆధీనంలో నడుస్తాయి. అయితే వీటిని రాత్రి వేళ అనుమతించరు. ఇది ప్రైవేటు అంబులెన్సులకు వరంగా పరిణ మించింది. మహా ప్రస్థానం వాహనాలు రాత్రి వేళల్లో నడపకపోయినా.. మృతదేహాన్ని మార్చురీలో ఉచితంగా భద్రపరచుకోవచ్చు. కానీ ఆ విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది ఉద్దేశపూర్వకంగానే బాధితులతో చెప్పరు. ఎక్కడా బోర్డులు ఉండవు.

- ప్రైవేట్ అంబులెన్స్ రాబందులు
- అవసరం ఆసరాగా వేలల్లో కిరాయి
- పగలూరాత్రి రెచ్చిపోతున్న మాఫియా
- ఆస్పత్రి సిబ్బందికీ భాగస్వామ్యం
- కలెక్టర్ సెట్ చేయాలని వేడుకోలు

ఆటోలదీ అదే తీరు

ప్రభుత్వాసుపత్రి రోడ్డుకు అవతల ఆటో స్టాండ్ పెట్టారు. 20 ఆటోల వరకూ ఉంటాయి. వీళ్లు కూడా ఆస్పత్రి రోగులపై అజమాయిషీ చలాయిస్తున్నారు. రోగులను తీసుకెళ్లడానికి ఆసుపత్రి ఆవరణలోకి బయటి నుంచి ఏదైనా ఆటో వస్తే వీళ్లందరూ ఆ డ్రైవరుపై ఒక్క ఉదుటున పడిపోతున్నారు. భయపెట్టి బయటకు పంపేస్తున్నారు. ఆటో స్టాండు ఉందని, బయటి నుంచి ఆటోలు రాకూడదని బెదిరిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సుల మాఫియా, ఆటోల దందా మితిమీరిపోయింది.పోనీ వీళ్లనే వినియోగించుకుందామంటే వీరు చెప్పే కిరాయికి మృతదేహాన్ని వదిలి వెళ్లిపోవడమే బాధితులకు ఉండే ఏకైక మార్గం.పేదలు వైద్యానికి వచ్చే ప్రభుత్వాస్పత్రి వద్ద ఇంత దందా జరుగుతున్నా, పేదలు దోపిడీకి గురవుతున్నా తనిఖీలకు వచ్చే పాలకులకు, రోజూ ఇక్కడే విధులు నిర్వర్తించే అధికారుల చెవిన పడకపోవడం విస్తుగొలుపుతోంది. ఇప్పటికైనా కలెక్టర్ ప్రశాంతి దృష్టి సారించి ఈ మాఫియాల నుంచి రక్షించాలని బాధితులు కోరుతున్నారు.

జేసీ చిన్న రాముడు బదిలీ

నూతన జేసీగా మేఘ స్వరూప్



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు బదిలీ అయ్యారు. ఆయ న స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న 2021 ఐఏఎస్ బ్యాచ్ అధికారి వై.మేఘ స్వరూప్‌ని ప్రభుత్వం నియమించింది. ఏడుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2018 ఐఏఎస్ బ్యాచ్‌నకు చెందిన చిన్న రాముడుకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. తదుపరి పోస్టింగ్‌కి సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని జీవోలో పేర్కొన్నారు.

స్పెషల్ టూరిజం హబ్‌గా రాజమండ్రి : దుర్గేష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూచనల మేరకు రాజమహేంద్రవరాన్ని స్పెషల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టులపై దృష్టి సారిస్తామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. సీఎం చంద్రబాబు వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సీఎంకి వివరించారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి ముందస్తుగా కర్టెన్‌రైజర్‌ని నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి సూచించగా చంద్రబాబు అంగీకరించారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా తీర్చిదిద్దుతున్న హేవలాక్ బ్రిడ్జిని త్వరితగతిన అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

3.30 లక్షల ఇళ్లకు కుళాయిలు : కలెక్టర్



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకం కింద ఇప్పటి వరకు 3.30 లక్షల గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. భారత ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ అదనపు జాయింట్ సెక్రటరీ సి.కమల్ కిషోర్ ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో దాదాపు 92 శాతం గృహాల వివరా లను ఐఎంఐఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లాలో 865 పాఠశాలలు, 868 అంగన్‌వాడీ కేంద్రాలకు సురక్షితమైన మంచినీటి ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.144.38 కోట్లతో 431 పనులు పూర్తిచేసి పంచాయతీలకు అప్పగించామని, మరో రూ.24.75 కోట్లతో 48 పనులు పూర్తి కావడంతో త్వరలో వాటిని కూడా పంచాయతీలకు అప్పగిస్తామని తెలిపారు. పీఎం గతి శక్తి పథకం కింద జిల్లాలో 2,517 కిలోమీటర్ల పైపులైను నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,335 కిలోమీటర్లు పనులు పూర్తి చేసి డేటా అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లాలో జల్‌జీవన్ మిత్రలుగా ఐటీఐ, పాలిటెక్నిక్, పీఎం కెకెవైలలో శిక్షణ పొందిన యువతను నియమిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కార్పొరేషన్‌లో విలీనం కానున్న రూరల్ మండలం పరిధిలోని 10 గ్రామాలతో పాటు రాజానగరం మండల పరిధి దివాన్‌చెరువు, కడియం మండలం వేమగిరి పంచాయతీ కార్యదర్శులతో సుమారు 2 గంటల పాటు సమావేశమయ్యారు.కార్యదర్శులకు పంచాయతీరాజ్ చట్టం, విధివిధానాలపై అవగాహన కల్పించారు.హుకుంపేట, పిడింగొయ్యిలలో పెద్ద పెద్ద భవనాలు కనిపిస్తున్నాయి వాటికి ఎంత పన్నులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. విధులు సక్రమంగా నిర్వహించకుంటే క్షమించేదిలేదని హెచ్చరించారు.

యూరియా అందక..రైతుల ఆందోళన

తాళ్లపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యూరియా అందక రైతులు లబోదిబోమంటున్నారు. గజ్జరం, అన్నదేవరపేట సొసైటీల వద్ద యూరియా విక్రయాల్లో బుధవారం గందరగోళం నెలకొంది. పొరుగూరు రైతులు తమ గ్రామానికి వస్తుంటే గ్రామానికి చెందిన రైతులకు యూరియా ఎప్పుడు దొరుకుతుందని గజ్జరం గ్రామ రైతులు అంటున్నారు. అన్నదేరవపేట సొసైటీ పరిధిలో ఎక్కువ గ్రామాలుండగా తాళ్లపూడి, కుకునూరు, వీరభద్రపురం, పైడిమెట్ట గ్రామాల రైతులు తామెక్కడికి వెళ్లాలని యూరియా కోసం పోరాటం చేస్తున్నారు. రైతులకు అధిక సబ్సిడీపై అందిస్తున్న యూరియా ఆధారుకార్డుపై సరఫరా చేయడం చాలా తప్పని పొలం పాస్‌బుక్, కౌలుకార్డు ఆధారంగా మాత్రమే సరఫరా చేయాలంటున్నారు.

సారథ్యం యాత్ర విజయవంతం : నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన సారథ్యం యాత్ర విజయవంత మైందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రామవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటి సారిగా రాజమహేంద్రవరం వచ్చిన పీవీఎన్ మాధవ్‌కు అపూర్వ స్వాగతం లభించిందన్నారు.తాను ఇచ్చిన పిలుపు మేరకు ఎస్‌టీ.రాజాపురం నుంచి రాజమహేంద్రవరం వరకు అనపర్తి కూటమి కార్యకర్తలు బైక్ ర్యాలీ చేశారన్నారు. సారథ్యం యాత్ర, బహిరంగ సభ కార్యక్రమాలను విజయవంతం చేసిన బీజేపీనాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



నామవరంలో పూర్తయిన టిడ్కో ఇళ్లు

ఇల్లింతేనా!

నేటికీ టిడ్కో అయోమయం

ఎక్కడ చూసినా.. పెండింగ్

రాజమండ్రిలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కో ఇళ్లు నిర్మిం చారు. అందులో 5,574 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి.కానీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలా తక్కువ మంది మాత్రమే ఇళ్లల్లో ఉన్నారు. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. నిడదవోలులో 1755 ఇళ్లు శాంక్షన్ కాగా 1248 మొదలు పెట్టారు. కొవ్వూరు 480 శాంక్షన్ కాగా 480 మొదలు పెట్టారు. కానీ మధ్యలో ఆపేశారు. బొమ్మూ రులో మొదటి దశలో 2528 ఇళ్లు నిర్మించారు. తొర్రే డులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళేశ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు. ఇందులో ఇప్పటి వరకూ బొమ్మూరులో నిర్మించిన ఇళ్లలో 2528 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా, 1977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు. బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. అక్కడ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయవలసి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులు పొందారు. ధవళేశ్వరం(వడ్డెర కాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్ప గించారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లల్లో 96 లబ్ధిదారులకు అప్పగించినా ఎవరూ రాలేదు. కేవలం ఒక్కరే నివాసం ఉంటున్నారు. రెండో దశలో నామ వరంలో 1104 ఇళ్లు, సింహాచల నగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1200 నిర్మించారు. ఇవి ఇంకా పూర్తి కాలేదు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. నిడదవోలులో 1755 శాంక్షన్ కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా జరగలేదు. ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపో యింది. కొవ్వూరు పట్టణం పరిధిలో పేదలకు 480 ఇళ్లు శాంక్షన్ కాగా 480 మొదలు పెట్టారు. ఇళ్ల నిర్మాణం జరిగినా, మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో మొత్తం పెండింగ్‌లో పడింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పగిస్తుందని ఎదురుచూసిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ పట్టణాలకు దగ్గరగా వేలాదిగా టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే. 2019 ఎన్నికలకు ముందే మొదటి దశ ఇళ్లను ఇవ్వడానికి సిద్ధం చేసింది. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలై.. వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టడం మొదలైంది. టిడ్కో గృహాలు ధ్వంసమ య్యాయి. రెండో దశలో ఆరంభించిన ఇళ్ల పరిస్థితి మరింత అధ్వానమైంది. వైసీపీ కేవలం టీడీపీ వేసిన రంగులు మార్చి..తన పార్టీ రంగులు వేయించిందే తప్ప మౌలిక సదుపాయాలు కల్పించలేదు. లబ్ధిదా ర్లకు అప్పగించలేదు. నామవరంలో 1104 ఇళ్లను నిర్మించారు. వసతులు లేవు.. నిడదవోలు, కొవ్వూరు, నామవరం డి.బ్లాక్ ఎక్కడ చూసినా ఇదే సమస్య. తెలుగుదేశం కూటమి ఇటీవల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ముందుకొచ్చింది. కానీ కాంట్రాక్టర్లు, అధికారులు పనులు ఆరంభించలేదు. ఈ పరిస్థితుల్లో వేలాది ఇళ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికే వాటి జీవిత కాలం సుమారు పదేళ్లు గడిచిపోయింది. ఈ అందమైన ఇళ్లను వెంటనే తమకు అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇవి ఇస్తే వేలాది మంది ఇంటి అవసరం తీరినట్టే. నామవరం ఇళ్లలో వినాయకచవితి ముందు కూడా చోరీ జరగడం గమనార్హం. విద్యుత్ వైర్లు, కిటికీల వంటివి దోచుకుపోతున్నారు.





నామవరంలో చిట్టడవిలా రహదారి.. ఇంటికి అల్లుకున్న పొదలు

ఇళ్లలో పెరుగుతున్న చోరీలు

ఇప్పటికే నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో ఇళ్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వర్క్స్, ప్లంబింగ్ వర్క్‌లకు సంబంధించిన మెటీరియల్ చోరీకి గురవుతోంది.దొంగలు పడి ఇష్టానుసారం దోచుకుపోయారు. నామవరంలో రెండో దశలో నిర్మించిన 1104 ఇళ్ళలో రూ.3 కోట్ల విలువైన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ మెరీటియల్ చోరీకి గురైనట్టు అక్కడి కాంట్రాక్టు తరపు వ్యక్తులు చెబుతున్నారు. ఇటీవల వినాయక చవితి ముందు కూడా చోరీ జరగడం గమనార్హం. ప్రస్తుతం బొమ్మూరు మొదటి దశ, తొర్రేడు, సింహాచలం నగర్ కాలనీలలో కొంతమంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. మిగతా చోట్ల కనీస మౌలిక సదుపాయాలు లేవు. నామవరం డి.బ్లాక్ వద్ద నిర్మించిన ఇళ్లలో 96 ఇళ్లను లబ్ధిదార్లకు అప్పగించినా ఒక్కరు మాత్రమే, వారైనా రాత్రి వేళ్ల ఇంట్లో ఉంటున్నారు. నిడదవోలు శ్లాబ్ కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించి తమకు ఇళ్లివ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

- టిడ్కో ఇళ్లకు తప్పని తిప్పలు
- వైసీపీ వైఖరితో పాడైన ఇళ్లు
- నామవరంలో 1104 ఇళ్లకు చెదలు
- మోరంపూడిలో 224 అంతే
- నిడదవోలు,కొవ్వూరులో శిథిలం
- కూటమి ఇస్తుందని ఎదురుచూపులు
- వృథాగా ఉండిపోయిన వేలాది ఇళ్లు
- శిథిలస్థితికి చేరుకుంటున్న వైనం
- అధ్వానంగా టిడ్కో ఆవరణలు



ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వలీబాబా దర్గా.. నగ్నంగా ఉన్న బాబా (ఫైల్)

హిందూ..ముస్లింల దేవుడు వలీబాబా

- మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న దర్గా
- నేటి నుంచి కొత్తలంకలో ఉరుసు ఉత్సవాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుల మత వైషమ్యాలకు అతీతంగా.. వర్గ విబేధాలకు దూరంగా అక్కడ హిందూ-ముస్లింలు ఒకే బాబాను ఆరాధిస్తారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వలీబాబా దర్గా వద్ద ప్రతీ ఏటా ఇదే రీతిలో ఉరుసు ఉత్సవాలు జరుగుతాయి. మౌనమే భాష, సేవే ధ్యానం, పరోపకారమే జీవిత పరమార్థాలుగా సర్వం త్యజించి నగ్న శరీరం తో ఉండే బాబా దివ్య సందేశాన్ని భక్తులకు అందించేవారు.నైజాం నవాబుల కాలం 1868లో నల్గొండ జిల్లా కొల్లేపల్లి గ్రామంలో బాబా జన్మించినట్టు అక్కడ ఉన్న ఆధారాలను బట్టి తెలుస్తుంది. 1918లో మూసీ నదికి వరద వచ్చినప్పుడు ఖాదర్‌వలీ బాబా ముమ్మిడివరం సమీపంలోని కొత్తలంక గ్రామానికి తొలిసారిగా వచ్చినట్టు స్థానికులు చెబుతారు. నగ్న శరీరంతో ఉండే ఈ బాబా నీళ్ల మీద నడక, మంచులో పడుకోవడం, వర్షంలో ఉన్నా తడవకపోవడం వంటి మహిమలు చూపేవారని చెబుతారు. బాబా పట్ల తొలిసారిగా కొత్తలంక గ్రామానికి చెందిన గేదెల వెంకటరత్నం ఆకర్షితులయ్యారు. ఆయనే బాబాకు సపర్యలు చేస్తుండేవారు. వెంకటరత్నం కుటుంబీకులే నేటికీ బాబాకు పూజలు చేస్తున్నారు. 1948 జూలై 28న బాబా తన దేహాన్ని త్యజించారు. అక్కడ నిర్మించిన సమాధే బాబా దర్గాగా పేరొందింది. నాటి నుంచి ప్రతీ ఏటా సమాధి వద్ద ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హిందూ-ముస్లింలు తరలివస్తుంటారు. వెంకటరత్నం సోదరులు ఏడాదికి ఒకరి వంతున సమాధి వద్ద పూజలు నిర్వహిస్తూ ఉత్సవాలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఉరుసు ఉత్సవాలు గురువా రం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం చందల్ (గంధం) మహోత్సవం, మధ్యాహ్నం తెప్పోత్సవం, అదే రోజు సాయంత్రం ఫకీర్ల మేళతాళాలు, నౌబత్‌ఖానా, వాయిద్యాలు, బ్యాండు మేళాలలతో పొన్నూరివారి గుర్రపు నాట్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహిస్తారు. 5వ తేదీ శుక్రవారం దీపారాధన, 6 శనివారం జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గేదెల రఘునాథ్‌బాబా, ముజావర్ ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత భోజన వసతి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులకు స్నానపు గదులు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఊరంతా.. మా..స్టార్లే!



పట్టుబట్టారు.. డీఎస్సీ సాధించారు

- శ్రీరంగపట్నంకు చెందిన 10 మంది ఎంపిక
- గ్రామంలో మొత్తంగా 25 మంది ఉపాధ్యాయులు



యల్లపు అన్నపూర్ణ



దాడి పార్వతి



గంగాభవాని



షణ్ముఖ కుమార్



రాపేటి శిల్ప



దాడి విజయ్



దాడి శివాజీ



బొడ్డేటి రఘురాం



కాళ్ళ శివరామకృష్ణ



ఎం.రాజు

(కోరుకొండ- ఆంధ్రజ్యోతి)

పల్లెటూరులో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే గొప్ప.. అటువంటిది ఒకే ఊరులో ఏకంగా పది మంది ఒకే తరహా ఉద్యోగం సాధిస్తే ఎలా ఉం టుంది.. ఆశ్చర్యమే కదూ.. అది కూడా అన్నీ మం చి ర్యాంకులే అయితే ఆ ఊరు పేరు మారుమ్రోగిపోతోంది.ప్రస్తుతం కోరుకొండ మండలం శ్రీరంగ పట్నం పేరు అలాగే మారుమ్రోగిపోతోంది. ప్రభు త్వం ఉమ్మడి జిల్లాకు సంబంధించి 1271 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 10 పోస్టుల్లో ఆ ఊరు వాళ్లే పాగా వసేశారు. ప్రభు త్వ పాఠశాలలో చదివినా పట్టుదలతో చదివి పది మంది మా..స్టార్లుగా మారిపోయారు. పది మం దికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామం కళలకు పుట్టిల్లు. ఇక్కడ ప్రతి ఇంట్లోను ఒక కళాకారుడు ఉంటాడు. అలాంటి గ్రామం నుంచి ఓ అరుదైన రికార్డు. ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో ఈ గ్రామం నుంచి 10 మంది ఉపాధ్యాయులు ఎంపికై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు.వీరిలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. మరో ఐదుగురు ఒకటి, అర మార్కులతో ఉపాధ్యాయ పోస్టులకు దూరమయ్యారు. లేదంటే ఆ సంఖ్య 15 మందికి చేరేది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో గ్రామానికి చెందిన దాడి పార్వతి 17వ ర్యాంకు సాధించిందిగణితంలో సిల్లర శెట్టి గంగాభవాని 16వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఎస్టీటీ బొడ్డేటి వీర వెంకట రఘురాం 24వ ర్యాంకు సాధించగా రాపాటి శిల్ప 35వ ర్యాంక్ సాధిం చా రు. ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి సుమారు 15 మంది ఉపాధ్యాయులుగా ఉన్నారు. అంటే మొత్తం ఆ గ్రామంలో 25 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

డీఎస్సీలో 10 మంది ఎంపికవడం ఆనందంగా ఉంది..



మెగా డీఎస్సీకి ముందు శ్రీరంగపట్నం గ్రాడ్యుయేట్స్ అనే వాట్సప్‌ను క్రియేట్ చేశా.. దీని ద్వారా ఎప్పటికప్పుడు డీఎస్సీ మెటీరియల్, జీకే, నోటిఫికేషన్స్, విద్యా సంబంధ సమాచారం గ్రూపులో పోస్టు చేసి డీఎస్సీ రాసే వారిని ప్రోత్సహించేవాడిని.ఈ డీఎస్సీలో 10 మంది ఒకేసారి ఎంపికయ్యారు. మా గ్రామంలో 25 మంది మాస్టార్లు ఉండడం ఆనందంగా ఉంది. - **తనకాల వెంకటభగవాన్, ఉపాధ్యాయుడు, శ్రీరంగపట్నం**

చిత్రం.. భళారే!





కపిలేశ్వరపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులా మజాకానా..ఒకసారి చూశారా పట్టేస్తారు.. చేతికి పనిచెప్పేస్తారు.. అచ్చుగుద్దినట్టు దింపేస్తారు..ఈ చిత్రంలో చూశారా..అంగర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని చిత్రీకరించారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులతో ఏం చేయిద్దామా అని ఉపాధ్యా యుడు ఆలోచించాడు. చిన్నారుల చేతులకు పనికల్పించాలని ఒక ఆలోచన చేశారు. ఒకసారి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాన్ని చూపించి మీకు నచ్చిన వస్తువుపై అచ్చుంగా ఈ ముఖం రావాలని చిత్రకళ ఉపాధ్యాయుడు డి. వెంకటేష్ సూచించారు. అంతే విద్యార్థినులు బి.నందిని, ఎస్.సత్యశ్రీ, సీహెచ్ . లావణ్య రంగంలోకి దిగారు. కోడిగుడ్డు పెంకు, ఆవాలు, రావిఆకులపై డా. రాధాకృష్ణన్ చిత్రాన్ని చిత్రీకరించారు.ఆ చిత్రాన్ని చూసిన హెచ్‌ఎం, ఉపాధ్యా య సిబ్బంది ఆశ్చర్యపోయారు. వెంటనే విద్యార్థినులను అభినందించారు.



అరగంటలో సమస్యను ఇలా పరిష్కరించారు..

అర గంటలో రోడ్డేశారు!

అధికారులు తలచుకుంటే ఏ పనైనా ఎంత సేపు.. సమస్య ఉందని అనుకోవాలే కానీ ఆగమేగాలపై చేసేస్తారు.. సమస్యను పరిష్కరించేస్తారు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రోడ్‌లో జడ్జి బంగ్లా వద్ద ఒక రోడ్డు ప్రమాదకరంగా మారింది.. ఆ రోడ్డును గమనించకపోవడంతో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు.. ఈ విషయం అధికారులు గుర్తించారు.. వెంటనే సమస్యను పరిష్కరించాలని తలంచారు. అనుకున్నదే తడవుగా అటు ట్రాఫిక్ పోలీసులు.. ఇటు మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది మంగళవారం ఆ పని దగ్గరుండి చేయించారు. కేవలం గంటలోనే రోడ్డును ఇలా సాఫీగా చేసేశారు.. ఇది గమనించిన ఆ ప్రాంతవాసులు ఆశ్చర్యపోయారు. అయ్యా అధికారులు పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై ఇదే విధంగా దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.. - **ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం**

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

రాజరాజేశ్వరికి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు



రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్ర వరంరూరల్ మం డలం శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల మండపేట మండలం ద్వారపూడి ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన బత్తిన రాజరాజేశ్వరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు దక్కింది. 2001లో సోషల్ టీచర్‌గా ఉపా ధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రాజరాజేశ్వరి ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం గా పనిచేశారు. అనంతరం 2019లో శాటిలైట్‌సిటీలో హెచ్‌ఎంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2021 జనవరి 26న అప్పటి ఉమ్మడిజిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి చేతుల మీదుగా బెస్ట్ పెర్ఫా ర్మెన్స్ అవార్డు అందుకున్నారు. 2021 ఆగస్టు 16న సీఎం జగన్ చేతుల మీదుగా నాడు నేడు ఫేజ్-1లో బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. 2024 సెప్టెంబరు 5న కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఇటీవల మండపేట మండలం ద్వారపూడి బదిలీపై వెళ్లారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని అమరావతిలో అవార్డు అందుకోనున్నారు. అవార్డురావడం తనకు మరింత బాధ్యత పెరిగిందని రాజరాజేశ్వరి తెలిపారు.

వినూత్నంగా మంగారాణి పాఠ్యాంశాల బోధన



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మ కంగా ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ లాలాచెరువు ఎంపీఎల్ పాఠశాల ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం లాలాచెరువు పాఠశాల ఎస్‌ఏ మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు కైవసం చేసుకోవడంపట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే మంగారాణి పాఠ్యాంశాలు బోధనలో వినూత్న పంథాలో వెళుతున్నారు. గతంలో బొమ్మలను తయారుచేసి వాటిని ఉదాహరణగా చూపిస్తూ పాఠశాలు చెప్పేవారు. అటుపై వీడియోల ద్వారా పాఠాలు అటుపై మంగారాణి యూట్యూబ్ పాఠశాల పేరుతో అద్భుతంగా బోధనలుచేసి ప్రశంసలు అందుకున్నారు. రెండువేల యూ ట్యూబ్ వీడియోలను తయారుచేసి మన్ననలు పొందారు. వీటన్నింటి నేపథ్యంలోనే ఈ అవార్డు లభించిందని మంగారాణి చెప్పారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా దుర్గాప్రసాద్



కొత్తపేట,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం అవిడి గ్రా మ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉ పాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆలేటి దుర్గాప్రసాద్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవా ర్డుకు ఎంపికయ్యారు ఈమేరకు ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. 40 సంవత్సరాలు వివిధ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు దుర్గాప్ర సాద్ తెలిపారు. ఈ అవార్డు రావడంపట్ల తోటి ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

కేపీపురం ఆంగ్ల ఉపాధ్యాయుడికి అవార్డు



బి.ప్రవీణ్ కుమార్

తొండంగి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బొబ్బాది ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కించుకున్నారు. రామచంద్రపురంలో పుట్టిన ఆయన 2002 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరంలో మొదటిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన యు.కొత్తపల్లి మండలంలోని పలు పాఠశాలల్లోను తొండంగి మండలం తలపంటి పేటలోను పని చేశారు. 2023లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ప్రమోషన్ పొంది ప్రస్తుతం పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2023లో ఆయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనకు అవార్డు రవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రాతి సత్యనారాయణ, ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రభావతి



అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లిలంక గంటి మోహన్‌చంద్రబాలయోగి జిల్లాపరిషత్ పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈమేరకు ఆమెకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రభావతి 2001 డీఎస్సీ ద్వారా ఎంపిక చే సిన 2002 జనవరి 21న రావులపాలెం మండలంలోని ఈతకోట జిల్లాపరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విధులు ప్రారంభించారు. సఖినేటిపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల ఏపీ ఎస్సీసీ స్టేట్ మోనటరింగ్ ఆఫీసర్‌గా కూడా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ప్రభావతిని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా యంత్రాంగం అభినందించారు.

ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం గాయత్రి...



సర్పవరంజంక్షన్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ హెడ్మాస్టర్ కె.గాయత్రికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన 2025 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి గాయత్రిని ఎంపిక చేశారు. తొలిసారిగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అప్లికేషన్ చేయకుం డా, ప్రభుత్వం లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభా పాటవాలను గుర్తించి ఈఅవార్డుకు ఎంపిక చేసింది. 30ఏళ్లుగా అనేక స్థాయిల్లో విద్యార్థులను ఉత్తమ విజేతలుగా తయారు చేయడం, పాఠశాల అభివృద్ధి పథంలో నడపటం వంటి కారణాలతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

తెలుగు అధ్యాపకుడు వీరరాఘవరావు..



అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న నక్కిన వీరరాఘవరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగుభాషపై ఉన్న మక్కువతో ఆయన విద్యాభ్యాసంలోనే కాకుండా అనేక అవార్డులు, రివార్డులు సాధించారు. 16సంవత్సరాలుగా అధ్యాపకుడిగా ఎందరినో తీర్చిదిద్దిన ఆయన వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సా ధిం చారు. తెలుగు ఉపాధ్యాయుడిగా, పాఠ్య పుస్తక రచయితగా, రాష్ట్ర విద్యాబోధన శిక్షణా మండలి విషయ నిపుణుడిగా ఆయన పనిచేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వీరరాఘవరావును అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ(బుజ్జి), వైస్ ఎంపీపీ పులగం బులిరెడ్డి, సొసైటీ ఛైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి అభినందించారు.

7వ తేదీన భీమేశ్వరాలయం మూసివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఈనెల 7న సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని మూసివేయనున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గా భవానీ తెలిపారు. 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నివేదన అనంతరం ఆలయం మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ,పూజాధికాలు అనంతరం ఉయదం 7.30 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతి ఇస్తామని తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

ఘనంగా గణపతి హోమం

ద్రాక్షారామ బీమేశ్వరాలయంలో దుండి గణపతి సన్నిధిలో బుధవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం ఆలయ అర్చకులు, వేదపండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణదారులు శాస్త్రోక్తంగా చేశారు. ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి

- 8,52,934 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం నాటికి మరింత తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 8,52,934 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 10.80 అడుగులుగా నమోదైంది.

పర్యవేక్షణ ఏదీ?

- ఎన్‌హెచ్ పనుల్లో అధికారుల తీరుపై మంత్రి జనార్దనరెడ్డి అసంతృప్తి



దివాన్‌చెరువు వద్ద రహదారి పనులు పరిశీలిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి

0దివాన్‌చెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అభివృద్ధి పనులు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులో టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) పద్ధతిలో ఓ ప్రైవేట్ సంస్థ చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యవేక్షణలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. రహదారి అభివృద్ధిలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను మంత్రి స్వయంగా చూశారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీపడవద్దన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గడువు మేరకు వేగవంతంగా పనులు పూర్తిచేయాలని, పటిష్ఠ రోడ్ల నిర్మాణానికి క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సూచించారు.

సత్యదేవుడి భక్తులకు రక్షణగా రూ 2.50 కోట్లతో షెడ్డు నిర్మాణం

- భూమిపూజ చేసిన దాత లారెస్ కంపెనీ ఎండీ కృష్ణంరాజు



పశ్చిమ రాజగోపురం వద్ద షెడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దాత కృష్ణంరాజు

అన్నవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దర్శనానికి వచ్చే భక్తులకు పశ్చిమ రాజగోపురం వద్ద ఎండా, వానల నుంచి రక్షణగా టెన్‌షెట్ షెడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. విశాఖపట్నంనకు చెందిన లారెస్ కంపెనీ అధినేత కృష్ణంరాజు దీనిని నిర్మిస్తున్నారు. దీని నిర్మాణంకోసం 2023లో అప్పటి ఈవో ఆజాద్ రూపకల్పనచేసి 30 వీఐపీ సత్రాన్ని తొలగించారు. కొన్ని సాంకేతిక కారణాలతో నిర్మాణం వాయిదా పడడంతో ఖాళీప్రదేశంగా దానిని ఉంచేశారు. తిరిగి ప్రస్తుత ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌లు మరోసారి దాతను సంప్రదించి అడ్డంకులను తొలగించారు. 120 అడుగులు పొడవు, 80 అడుగులు వెడల్పుతో దీనిని నిర్మిస్తుండగా సుమారు రూ. 2.50 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ భూమిపూజలో దాత దంపతులతో పాటుగా ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్, ఈఈ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక బలవన్మరణం

- పురుగుల మందు తాగి రెండేళ్ల కుమారుడుకి పట్టించిన తల్లి
- కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భర్త మరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. అతడు లేని జీవితాన్ని ఊహించలేకపోయింది. రెండేళ్ల కుమారుడ్ని ఏ విధంగా పెంచి పెద్ద చేయాలో ఎంతో ఆలోచించింది.. చివరకు జీవితంపై విరక్తితో పురుగుల మందు కలిపిన సోడా తాగి తర్వాత కుమారుడితో తాగించి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన తల్లి, కుమారుడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఇద్దరు మృతిచెందారు. ఈ విషాద సంఘటన కాకినాడ జిల్లా సర్పవరం శివారు గాంధీకాలనీలో జరిగింది. వివరాల్లోకెళితే కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురం గాంధీకాలనీకి చెందిన జనపల్లి గోపి, ఆకాంక్ష (25) భార్యాభర్తలు. వారికి రెండేళ్ల కుమారుడు సార్విక్ ఉన్నాడు. భర్త మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసేవాడు. కుమారుడి పుట్టిన రోజు వేడుక కోసం రూ.3 లక్షల అప్పులు చేశాడు. అవి తీర్చలేక, ఒత్తిడి తట్టుకోలేక జూలై 22న పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. భర్త చనిపోయిన దగ్గర నుంచి ఆకాంక్ష రోధిస్తూ తమ భవిష్యత్తుపై కలత చెంది మానసికంగా కుంగిపోయింది. అత్త, పుట్టింట్లో తలో పది రోజులు ఉండేది. ఇటీవలే పుట్టింటి నుంచి అత్తమామలు నివాసం ఉండే గాంధీ కాలనీకి వచ్చింది. భర్తను తలచుకుంటూ జీవితంపై విరక్తితో గతనెల 31న మధ్యాహ్నం 3 గంటల సమయంలో సోడాలో పురుగుల మందు కలిపి ముందు తాను తాగిన తర్వాత కుమారుడికి పట్టించింది. ఇద్దరూ తీవ్ర అస్వస్థతకు గురై


భర్త గోపితో భార్య ఆకాంక్ష, కుమారుడు (ఫైల్ ఫొటో)

పడి ఉండటాన్ని గమనించిన అత్తమామలు వెంటనే చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతోన్న తల్లి, కుమారురుడు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతు రాలి తల్లి దోనం శాంతికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆదేశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. మృతదేహాలకు పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిం చినట్లు తెలిపారు. కుమారుడు, కోడలు, మనవ డు సుమారు 45 రోజుల వ్యవధిలో మరణిం చడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తల్లిదండ్రులు మందలించారని బాలిక ఆత్మహత్య

శంఖవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇంటర్ బాలిక ఆత్మహత్య చేసుకుంది. అన్నవరం అదనపు ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన కనిగిరి వరలక్ష్మి అపర్ణ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ చదువుతుంది. అయితే మంగళవారం రాత్రి తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఉరివేసుకుంది. బుధవారం అదనపు ఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేశారు.

దివ్యాంగ బాలికపై వృద్ధుడి అత్యాచారం

మామిడికుదురు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో ఓ గ్రామంలో 16 ఏళ్ల దివ్యాంగ బాలికపై అదే గ్రామానికి చెందిన 70 ఏళ్ల పైబడిన వృద్ధుడు అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు పరువు పోతుందన్న కారణంతో ఈ విషయాన్ని రహస్యంగా ఉంచారు. బాలిక గర్భం దాల్చడంతో గర్భస్రావం చేయించారు. ఈ సంఘటన 3 రోజులు క్రితం గ్రామంలో ఆ నోటా ఈ నోటా గుప్పుమనడంతో గ్రామ పెద్దలు రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామంలోని పెద్దలు సమావేశమై బాధిత బాలిక కుటుంబ సభ్యులకు రూ.లక్షల్లో డబ్బు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని గ్రామంలో చర్చింకుంటున్నారు. దీనిపై తమకు ఏ ఫిర్యాదు అందలేదని నగరం పోలీసులు తెలిపారు.

చేబ్రోలులో డెంగ్యూ జాడలు

పెరుగుతున్న జ్వర బాధితులు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డెంగ్యూ జాడలు కనిపిస్తున్నాయి. గ్రామంలో పలువురు వైరల్ ఫీవర్లతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రులకు వస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ పరిస్థితి ఉండగా, 2రోజులుగా మరింత తీవ్రమైంది. ఈబీసీ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలుడికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు స్థానికులు చెప్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు. బాలుడికి సాధారణ జ్వరమేనని వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీని రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, జనసేన నాయకులు సందర్శించి జ్వర పీడితులకు అందుతున్న వైద్యసేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రతన్‌తో మాట్లాడారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

మందులు తీసుకురమ్మని డబ్బిస్తే మద్యం తాగడంతో ఘాతుకం

కరప, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. మందులు తీసుకురమ్మని డబ్బిస్తే వాటితో పూటుగా మద్యం తాగి రావడంతో కోపోద్రిక్తుడైన కొడుకు తండ్రిని గొడ్డలితో విచక్షణారహితంగా నరికి హతమార్చాడు. కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ హత్యోదంతానికి సంబంధించి స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పలంక శివారు మొండి గ్రామంలో నివాసముంటున్న కాలాడి సూర్యచంద్రరావు(50)కు నలుగురు కుమారులున్నారు. అతడి భార్య క్యాన్సర్‌తో బాధపడుతూ మూడేళ్ల క్రితం చనిపోయింది. సూర్యచంద్రరావు సముద్రంలో వేటకు వెళుతూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. సూర్యచంద్రరావు మూడో కుమారుడు మహేష్ ఫిట్స్ వ్యాధి, మానసిక రుగ్మతతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. సోదరుడికి మందులు తీసుకురమ్మని రెండో కుమారుడు చంద్రశేఖర్ తండ్రికి రూ.500 ఇచ్చి పంపించాడు. అయితే ఆ డబ్బులతో పూటుగా మద్యం తాగి వచ్చిన తండ్రి తో కొడుకు చంద్రశేఖర్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో పట్టలేని కోపంతో తండ్రిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. తండ్రి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కరప ఎస్ఐ తోట సునీత సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ కేసు నమోదు చేశారు.


సూర్యచంద్రరావు మృతదేహం

రైతులను ఆదుకోని ప్రభుత్వం

వారికి మద్దతుగా వైసీపీ ఉద్యమం : శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స

కాకినాడ, సెప్టెంబరు 3, (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వారికి యూరియా కూడా సరిగా అందజేయలేకపోతోందని, రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వైసీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కాకినాడలోని వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇబ్బంది పడేది రైతేనని, కూటమి ప్రభుత్వంలో అన్నదాతల పరిస్థితి చాలా దారుణంగా తయారైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్పా, చేతల్లో ఎక్కడా కనిపించడంలేదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అయితే అనావృష్టి, లేకుంటే అతివృష్టి అని ధ్వజమెతారు. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం అగచాట్లు పడుతున్నారన్నారు. వారికి మద్దతుగా ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపి, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని, ఎంతోమంది ప్రాణత్యాగాల ప్రతిఫలమని, దీని కోసం పెద్ద ఎత్తున వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు అన్ని నియోజకవర్గాల ప్రజామద్దతు నిరసన ఉద్యమం చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. గత నెల 30న


కాకినాడలో మాట్లాడుతున్న బొత్స

కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు విశాఖలో ఉన్నా కనీసం విశాఖ ఉక్కుపై నోరెత్తలేదన్నారు. ఎన్నికల ముందు 21 మంది ఎంపీలు ఉన్నారు.. మీరు ఉప్పుకారం తింటున్నారా లేదా? అంటూ తెగ ఊగిపోతూ వైసీపీని విమర్శించిన పవన్‌కల్యాణ్ నేడు అధికారంలో ఉండి ఏం చేస్తున్నారని బొత్స ప్రశ్నించారు. నాటి పౌరుషం ఏమైందని, ఉప్పు కారం మీరు తినడం మానేశారా? అంటూ పవన్‌పై ధ్వజమెత్తారు. దీనిపై మీ కార్యాచరణ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కుపై అక్కడి పెద్దలపై ఏం మాట్లాడారో వెల్లడించాలని బొత్స పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.రెండు లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చిందని, అది నిజమా! కాదో! చెప్పాలని డిమాండ్ చేశారు. సుగాలి ప్రీతి హత్య కేసుపై తమ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి, సీబీఐకి అప్పగించిందన్నారు. ఇలాంటి విషయంలో మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం చంద్రబాబు అన్నట్టుగానే అసెంబ్లీలో తేల్చుకుంటామని ఆయన వెల్లడించారు. అధికార పక్షం నుంచి కూటమి, ప్రతిపక్షంగా వైసీపీ రెండు తేల్చుకుందాం రండి అని పిలుపునిచ్చారు.

జేఎన్టీయూకే, నాస్కామ్ మధ్య ఎంవోయూ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ఇనిషియేటివ్‌ను అమలుచేసేందుకు వీసీ సమావేశ హాల్లో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ఏ.కృష్ణమోహన్ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో జేఎన్టీయూకే, నాస్కామ్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ సమక్షంలో జేఎన్టీయూకే, నాస్కామ్ అధికారులు సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వృత్తి నైపుణ్యాలు, హ్యాకథాన్లు, పరిశ్రమ నాయకత్వ సెషన్లలో కోర్సులను ఉచితంగా అందిస్తారన్నారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈఎంవోయూ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాస్కామ్ ప్రతినిధులు ఉదయ్‌శంకర్, ప్రవీణ్‌కుమార్ రెక్టార్, ఓఎస్డీ, పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


వీసీ ప్రసాద్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

చీటీల పేరుతో రూ.2.39 కోట్లు మోసం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పిఠాపురంలో ఇద్దరు నిందితుల అరెస్ట్

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో ఖాతాదారులను కోట్లల్లో మోసం చేసిన ఇద్దరు నిందితులను పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో 2014లో సత్యశివానీ చిట్‌ఫండ్ కంపెనీని కొర్రా సత్యనారాయణ, పక్కుర్తి వరహాలరావు, లోకారెడ్డి భాస్కరరావులను డైరెక్టర్లుగా ప్రారంభించారు. రూ.5 లక్షలు నుంచి రూ.20లక్షల వరకూ చీటీలు వేశారు. 2023లో చీటీలు పాడుకున్న ఖాతాదారులకు సొమ్ములు చెల్లించకపోవడంతో సుమారు 94మంది అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ అనంతరం ఖాతాదారులను మోసం చేసినట్లు వెల్లడి కావడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సునంత పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సత్యశివానీ చిట్‌ఫండ్స్ రికార్డులు, ఖాతాదారులు వివరాలు, ఇతర ఆధారాలను పిఠాపురం సీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. 94మంది ఖాతాదారులకు సంబంధించి రూ.2.39 కోట్లను చెల్లించకుండా చిట్‌ఫండ్ కంపెనీ డైరెక్టర్లు పక్కదోవపట్టించి సొంత అవసరాలకు వినియోగించినట్టు విచారణలో వెల్లడైంది. విచారణ అనంతరం కంపెనీ డైరెక్టర్లు పిఠాపురం మంగాయమ్మరావుపేటకు చెందిన కొర్రా సత్యనారాయణరావు, గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన లోకారెడ్డి భాస్కరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో మరికొందర్ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న ఉదయం 8గంటలకు ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన, పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా 2025 నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ తెలిపారు. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్ స్టాఫ్ వచ్చి అప్రెం టిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టిసి సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు ఒరిజినల్స్‌తో హాజరుకావాలని, 9440408182లో సంప్రదించాలని కోరారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా స్మరణ్ రాజ్

- ప్రస్తుత పీవోకి పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం



రంపచోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ నూతన పీవోగా 2022 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత పీవో కట్టా సింహాచలానికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఈయన తెలుగువాడు కావడం విశేషం. తెలంగాణలోని సిద్దిపేట జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్ విద్యానగర్‌లో ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించారు. తండ్రి రమేష్ కుమార్ హైదరాబాద్‌లో న్యాయవాది వృత్తిలో ఉన్నారు. 2021లో సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 676వ ర్యాంకు సాధించి 2022 బ్యాచ్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. తొలుత అనకాపల్లి అసిస్టెంట్ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. అనంతరం మార్కాపురం, నూజివీడు సబ్ కలెక్టరుగా పనిచేశారు. నూజివీడు నుంచి ఇటీవలే బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. స్మరణ్ రాజ్ ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు. 2017లో బ్రెయిన్ హెమరేజ్ సమస్యతో బాధపడిన తర్వాత రికవరీ అయ్యి ఐఏఎస్ సాధించారు.

లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్ వ్యాన్

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
- దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో ఘటన
- బాధితులంతా శ్రీకాకుళం వాసులే .. పోలీసు కేసు నమోదు

దేవరపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొనడంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామానికి చెందిన జీరు అసిరినాయుడు, లక్ష్మీదంపతుల కుమారుడు లక్ష్మణరావు (నాని) 28 సంవత్సరాలు నెల్లూరులో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈవెంట్ కోసం తన డ్యాన్స్ బృందం 11 మందితో కలిసి టాటామ్యాజిక్ వ్యాన్‌లో బయల్దేరాడు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న లారీని మ్యాజిక్ వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడంతో డ్యాన్స్ మాస్టర్ లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. 10 ఏళ్ల నుంచి లక్ష్మణరావు ఎంఎండీఎస్ పేరుతో డ్యాన్స్ బృందాన్ని నడుపుతున్నాడు. స్వల్ప గాయాలైన శ్రావణ్, ఐరీష్మ, హరిను హుటాహుటిన 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, మృతదేహాన్ని గోపాలపురం ఆరోగ్యకేంద్రానికి తరలించారు. లక్ష్మణరావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



మృతుడు జీరు లక్ష్మణరావు (ఫైల్)
ప్రమాదానికి గురైన టాటామ్యాజిక్ వ్యాన్

తెలికిచర్లలో అశ్లీల నృత్యాలు

- ఆలస్యంగా వెలుగులోకి
- తమ దృష్టికి రాలేదన్న సీఐ బాలశౌరి

నల్లజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం తెలికిచర్లలో ఆదివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో భాగంగా జరిగిన ఊరేగింపులో మహిళలతో రికార్డింగ్ డ్యాన్స్ వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌పై మహిళలు అశ్లీలంగా వేసిన నృత్యాలను కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో బంధిస్తూ సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యింది. తెలికిచర్ల, కొత్తపేటలో రెండు చోట్లా రికార్డింగ్ డ్యాన్స్ జరగడంతో మండలంలో సంచలనమయ్యింది. మొన్న ఘంటవారిగూడెంలో జరిగిన సంఘటన మరువకముందే మరో సంఘటన జరగడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై నల్లజర్ల సీఐ బాలశౌరిని వివరణ కోరగా, తమ దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


రికార్డింగ్ డ్యాన్స్ వేస్తున్న దృశ్యం (ఫైల్)

అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన స్వామి,అమ్మవార్లు


పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో మూడో రోజు బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై కొలువుదీర్చి అలంకరించారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో పంచసూక్తాలతో వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. సర్వ దైవత్య హోమం, మహాశాంతి హోమం, పంచ సూక్తాలతో హోమం, మూల హోమం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర నామార్చన మొదలగు విశేష పూజలుచేశారు. పవిత్రోత్సవాల్లో ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సమసిన వివాదం

- గిరిజన విద్యార్థి మృతి కేసులో కలెక్టర్ జోక్యం
- మృతుని కుటుంబానికి పరిహారం, ఉద్యోగ కల్పన హామీతో ఆందోళన విరమణ

రంపచోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వివేకానందరెడ్డి మృతిలో గత మూడురోజులుగా ఐటీడీఏ అధికారుల తీరుపై కుటుంబసభ్యులు చేపట్టిన ఆందోళన బుధవారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ జోక్యంతో విరమించారు. విద్యార్థి మృతిపై చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం నుంచి బంధువులు, ఆదివాసీ నాయకులు కలిసి ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా పెద్ద దిక్కుగా ఉన్న ఐటీడీఏ పీవో వచ్చి న్యాయం చేస్తామని చెప్పి భరోసా కల్పించాలని బాధితులు కోరగా, ఆయన రాకపోవడంతో గొడవ ఉధృతమైంది. ఫలితంగా మూడురోజులుగా విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం జరగలేదు. ఎట్టకేలకు కలెక్టర్ రంగంలోకి దిగి ఐటీడీఏ, గిరిజన సంక్షేమ అధికారులకు ఆదేశాలిచ్చి, మృతుడి కుటుంబానికి ఉద్యోగ కల్పనపై అధికారులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది లిఖిత పూర్వక హామీతో పాటు రూ.1.50 లక్షల తక్షణ పరిహారం అందజేయడంతో ఆందోళనను విరమించారు. అలాగే ఐటీడీఏ తరఫున గిరిజన సంక్షేమ డీడీ రుక్మాంగడయ్య ఆందోళనకారులతో చర్చించారు. దీంతో కలెక్టర్‌కు మృతుడి కుటుంబీకులు గిరిజన నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. మూడోరోజు ఆందోళనలో నాయకులు మట్ల వాణిశ్రీ, పల్లాల అనసూయ, సాదల చిలకమ్మ, బాలు అక్కిన, మద్దేటి అంజిరెడ్డి, కత్రం రామదాసు దొర, గొర్లె ప్రణీత్, ఐవీ రమణ, ఈక నరసన్నదొర పాల్గొన్నారు.



రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గుమిగూడి ఉన్న ఆందోళనకారులు

భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి

- ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భాద్రపద ఏకాదశి, వినాయక ఉత్సవాలు సందర్భంగా బుధవారం అయినవిల్లిలో సిద్ధివినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష దూర్వార్చన, మాడవీధిసేవ, ప్రత్యేకాలంకరణ చేశారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. బుధవారం పంచామృతాభిషేకాలు 6, లఘున్యాస అభిషేకాలు 260, ప్రత్యేక దర్శనం 804, శ్రీలక్ష్మీగణపతి హోమం 58, నామకరణం 1, అక్షరాభ్యాసాలు 8, తులాభారం 15, ద్విచక్ర వాహన పూజలు 24, కొబ్బరికాయల మొక్కుబడి 20, పులిహోర 3481, లడ్డూ 4420, అన్నప్రసాదం 5,900, అన్నప్రసాద విరాళం రూ.2,46,046, విరాళాల ద్వారా రూ. 2,591, మొత్తం ఆదాయం రూ. 5,57,853 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ దుర్గాభవాని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు



ట్రాక్టర్ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

అమలాపురం రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కామనగరువు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతిచెందినట్టు అమలాపురం పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో భట్నవిల్లి వైపు నుంచి అమలాపురం వైపు ట్రాక్టరు, మోటారు సైకిల్ ఒకే మార్గంలో వెళుతున్నాయి. అయితే ట్రాక్టర్ వెనుకభాగం మోటారు సైక్లిస్టుకు తగలడంతో భట్నవిల్లికి చెందిన వడ్రంగి మేస్త్రి గేద ఫణికుమార్ (32) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మోటారు సైకిల్ పై వెళుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

అభివృద్ధి పనుల్లో ప్రొటోకాల్ పాటించడం లేదు

● మండల పరిషత్ సమావేశంలో ఏకరువు పెట్టిన ప్రజాప్రతినిధులు


సమావేశంలో అధికారులకు విన్నవిస్తున్న ప్రజా ప్రతినిధులు

రాజానగరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించి గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల విషయంతో తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటూ పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులకు మొరపెట్టుకున్నారు. రాజానగరం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయం సమావేశపు హాల్లో బుధవారం జరిగింది. ఈసందర్భంగా మండలంలో వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రహదార్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటి కార్యక్రమాల్లో జిల్లాస్థాయి అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయి అధికారులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలను విస్మరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గ్రామ స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం అందించేలా చూడాలని ముక్తకంఠంతో కోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయాశాఖల అధికారులకు సూచించారు. అనంతరం వివిధశాఖలకు సంబంధించి ప్రభుత్వం కల్పిస్తున్న పలు రాయితీ పథకాలు గురించి సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద్ద, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొల్లి సత్య, కోడి రాఘవులు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, పంచాయతీ రాజ్ ఏఈ వినయ్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజు, ఎంఈవో రామన్నదొర, ఉపాధి హామీ ఇన్‌చార్జ్ ఏపీవో బాలరాజు, పంచాయతీ కార్యదర్శులు, వీఆరోలు పాల్గొన్నారు.


నన్నయ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి, యువజన, దళిత ప్రజాసంఘాలు

నన్నయలో పొలిటికల్ సైన్స్ గ్రూప్ కొనసాగించాలి

● రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చిన విద్యార్థి, యువజన, దళిత, ప్రజాసంఘాలు
● పొలిటికల్ సైన్స్ గ్రూప్ ప్రవేశాలు నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు దగ్ధం

దివాన్‌చెరువు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ గ్రూప్‌ను యథావిధిగా కొనసాగించాలని నన్నయ రిజిస్ట్రార్ కె.వి.స్వామికి వినతిపత్రంను అందజేశారు. అనంతరం పొలిటికల్ సైన్స్ విభాగంలో ప్రవేశాలను నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను విశ్వవిద్యాలయం కేంద్రపరిపాలన భవనం ఎదుట బుధవారం దగ్ధం చేశారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, దళితసంఘం నాయకులు కోరుకొండ చిరంజీవి, కె.వి.పి.ఎస్.జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఐ.ఎఫ్.టి.యూ జిల్లాకార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు వేణుగోపాల్, ఎన్.వెంకటరత్నంరాజు, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, పీడీఎస్‌యూ నాయకులు కె.సతీష్, శ్రీకాంత్, రాజ్యాంగపరిరక్షణ సమితి కన్వీనర్ ఎం.లక్ష్మీపతి, నన్నయ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్‌లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలను నిలిపివేస్తూ తీసుకున్న ఏకపక్షనిర్ణయంవల్ల విద్యార్థులు ఇబ్బంది పడతారన్నారు. తక్షణమే విశ్వవిద్యాలయంలో ఆగ్రూప్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఉత్తున ఉద్యమిస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ డి.అశోక్‌కుమార్, రాజేష్. ఎస్.ఎఫ్.ఐ.నాయకులు జ్యోతి, లహరి, హేమంత్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ సైన్స్ విభాగం యథావిధిగా కొనసాగింపు

● నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య స్వామి

దివాన్‌చెరువు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇక్కడి ప్రధాన క్యాంపస్‌లో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం మూసివేస్తారంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవంకాదని, రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి తెలిపారు. పొలిటికల్ సైన్స్ విభాగం యథావిధిగా కొనసాగుతుందని బుధవారం విడుదలచేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ విభాగం మూసివేస్తారని, తరలిస్తారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని చెప్పారు. పొలిటికల్‌సైన్స్ విభాగంలోని కొన్ని అంతర్గత సమస్యల కారణంగా ముందుగా 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు తాత్కాలికంగా నిలిపివేయడానికి ప్రతిపాదనచేసినప్పటికీ తరువాత విద్యార్థుల అభ్యర్థనల మేరకు విభాగాన్ని యథావిధిగా కొనసాగించేందుకు నిర్ణయించుకున్నామని చెప్పారు.

ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన

జూహితకు సహకరిస్తాం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


జూహిత ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన జూహితగుణ ఉన్నతికి తాము అన్నివిధాలుగా సహకారాన్ని అందిస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జూహిత గుణ ఇటీవల కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణపతకం సాధించడం రాజమహేంద్రవరానికి, ఆంధ్రరాష్ట్రానికి గర్వకారణమన్నారు. బుధవారం జూహి త రాజమహేంద్రవరం చేరుకోవడంతో స్కూల్ ప్రాంగణంలో ఆమెను ఘనంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సత్కరించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించడానికి ఆమె చేసిన కృషితో పాటు తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయులు ప్రోత్సాహం ఉందన్నారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జూహితను ప్రోత్సహిస్తామన్నారు. తమ ట్రస్ట్ ద్వారా రూ.25వేలు నగదును అంది స్తామన్నారు. ఈసందర్భంగా జూహిత మాట్లాడుతూ తనకు సహకరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం యు.విజయలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ కందికొండ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్య పరిష్కరిస్తా

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల


వివాదంలో వున్న భూసమస్యపై చర్చిస్తున్న గోరంట్ల, కృష్ణ నాయక్

రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీర్ఘ కాలంగా వున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయాలని.. విభేదాలు లేకుండా అందరికీ న్యాయం చేస్తామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తెలిపారు. రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ పరిధి సర్వే నెం.511 ప్రభుత్వ భూమిలోగల శివాలయం, అంబేడ్కర్ విగ్రహాలు కలిగిన ప్రాంతాన్ని ఆర్డీవో కృష్ణనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో భూ దోపిడీదారులు, కబ్జాదారులు రాజ్యమేలారని, నకిలీ డాక్యు మెంట్లు పుట్టించి రూరల్ నియోజకవర్గం పరిధి ముఖ్యంగా రూరల్ మండలంలో కోట్లాది రూపాయల విలువచేసే భూములను కబ్జా చేశారని, వాటిని త్వరలో రీసర్వే చేయించి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అక్రమాలకు పాల్పడినవారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పిడింగొయ్యి గ్రామంలో శివాలయం, అంబేడ్కర్ విగ్రహం కలిగిన ప్రాంతంలో సుమారు ఐదెకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించడంతో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నందున ఇరు వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా కొంత స్థలాన్ని శివాలయంగుడి నిర్మాణానికి, మరికొంత స్థలాన్ని అంబేడ్కర్ విగ్రహం, కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు కేటాయించి మిగిలిన స్థలాన్ని పంచాయతీ పరిధిలోని ఇళ్లులేని బడుగు బలహీన వర్గాలవారికి ఇళ్లు నిర్మించేందుకు కేటాయిస్తామని ఈవిషయాన్ని ఇరువర్గాల వారు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, తహసీల్దార్ శ్రీనివాస్, రేలంగి సత్యనారాయణ, బత్తుల శివ, ప్రభుదాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అందరినీ అక్షరాస్యులుగా మార్చాలి

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



అక్షరాంధ్రలో అక్షరాస్యులును చేస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ (అక్షరాంధ్ర) కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో అందర్నీ అక్షరాస్యులుగా మార్చాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉల్లాస్ వలంటీర్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంద్వారా మం డలంలోని మహిళాశక్తి, ఉపాధిహామీ పథకంలో వున్న నిరక్షరాస్యులను చేసేందుకు నియమించిన వలంటీర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రపంచంలోనే నలందా, తక్షశిల విద్యాలయాలు మన దేశంలో మొదటగా ప్రారంభించారని, అయినా మన జిల్లాలో 75,528 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, వీరిని అక్షరాస్యులుగా మార్చే బాధ్య త మనందరిపైనా ఉందన్నారు. మండలంలో డ్వాక్రా ఉపాధిహామీలో 3వేల మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరికి చదువు చెప్పేందుకు 300 మంది వలంటీర్లను ఏర్పాటుచేశారు. వీరికి చదువు నేర్పే కరదీపికలను ఎమ్మెల్యే వలంటీర్లకు అందజేశారు. అనంతరం మండల పరిషత్ నిధులు 1.85 లక్షలతో కొనుగోలు చేసిన కంప్యూటర్, ఫర్నీచర్‌ను ఎంపీడీవో కార్యాలయానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏపీఎం సుప్రియ పాల్గొన్నారు.

'ఉల్లాస్' అక్షర ఆంధ్ర శిక్షణా తరగతులు

రంగంపేట(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలంలో గల నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి అందరినీ అక్షరాస్యులుగా చేసేందుకు వలంటీర్లు కృషిచేయాలని ఎంపీ డీవో వీవీ సాయిబాబు అన్నారు. బుధవారం రంగంపేట మం డల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు, మేట్‌లకు ఉపాధి హామీ ఏపీవో శేషశ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. మహిళలు ఇప్పుడు అన్నిరంగాల్లోనూ అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, రంగంపేట కాంప్లెక్స్ హెచ్ ఎం వి.పార్థసారధి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు పాల్గొన్నారు.

అక్షరాస్యతలో రాష్ట్రం వెనుకబడి ఉంది

సీతానగరం,(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతలో మన రాష్ట్రం వెనుకబడి 29వ స్థానంలో ఉందని ఏపీఎం జిలాని అన్నారు. బుధవారం సీతానగరం స్త్రీశక్తి భవన్‌లో డ్వాక్రా మహిళలతో అక్షర ఆంధ్ర ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడేళ్ళలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేందుకు ఉల్లాస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్వాక్రా సంఘాలలో మహిళలు ఎక్కువగా నిరక్షరాస్యులుగా ఉన్నారని పిల్లలకు విద్యపట్ల సరైన అవగాహన కల్పిం చలేకపోతున్నారని అన్నారు. మండలంలో 2500 మంది నిరక్షరాస్యులను గుర్తించామని వారికి విద్యను నేర్పించామన్నారు. ఎంపీడీవో ఎం.భారతి అక్షర ఆంధ్ర సంపూర్ణ అక్షరాస్యత ప్రతిజ్ఞ చేయించారు ఎంఈవో స్వామి నాయక్, ఎంపీపీ జ్యోత్స్న, ఏపీవో సత్యవాణి, పాల్గొన్నారు.

వాంబే కాలనీలో 98 ఇళ్లకు నీటి సదుపాయం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 42వ డివిజన్ రత్నం పేట వాంబేకాలనీలో 98 ఇళ్ళకు మంచినీటి కుళాయి సదుపాయాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కల్పించారు. తాగునీటి కోసం స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించారు. విద్యుత్ లోవవోల్టేజీ సమస్యను చెప్పడంతో ఆయన స్పందించారు. తాగునీటి సరఫరాను, ట్రాన్స్‌ఫార్మర్‌ను వేయించి వారి సమస్యను తీర్చారు. తాగునీటి కుళాయిలు వెయించి నీటిపన్ను పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా వారంతా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ ఇంచార్జి మళ్ళ వెంకటరాజు, కాశి నవీన్ కుమార్, బుడ్డిగ రాధా, కేవీ శ్రీనివాస్, సావిత్రి, వానపల్లి శ్రీనివాస్, కొండబాబు పాల్గొన్నారు.

ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ డైరెక్టర్‌గా వేణమ్మ



అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టరుగా బిక్కవోలు మండల మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రక టిం చిన పలు కార్పొరేషన్ డైరెక్టర్లలో ఆమెకు స్థానం లభించింది. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కొనసాగుతున్న వేణమ్మ 2014-19మధ్య బిక్కవోలు మండల పరిషత్ అధ్యక్షురాలిగా పనిచేశారు. 2024 ఎన్నికలలో కూటమి విజయానికి ఆమె కృషి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవ కాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జనార్ధనస్వామి ఆలయకమిటీ ప్రమాణస్వీకారం


జేగురుపాడు జనార్ధనస్వామి ఆలయకమిటీ ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

కడియం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కడియం మండలం జేగురుపాడు శ్రీదేవి-భూదేవీ సమేత జనార్ధనస్వామి ఆలయకమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా కర్రి చినబాబు, కార్యవర్గ సభ్యులుగా వల్లూరి మోహన్, వెల్ల పద్మశ్రీ, బిళ్ళకుర్తి కుమారస్వామి, పసలపూడి వీరవెంకటలక్ష్మి, జుత్తుగ సుబ్బలక్ష్మి, గ్రంధి రామలింగేశ్వరరావు, అద్దంకి సత్యవేణి, కేసనపల్లి గడోత్కుడు(గట్టియ్య) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్యరామకృష్ణ, మర్రెడ్డి రమేష్, సూర్యకుమార్, ఆకుల మూలరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ బీమా వారోత్సవాలు



బీమా వారోత్సవాల సందర్భంగా వాక్‌ఫర్ ఎల్ఐసీ, ఎల్ఐసీ ఎంప్లాయిస్ హెల్త్‌వాక్ ర్యాలీ దృశ్యం

రాజమహేంద్రవరంరూరల్/కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమాసంస్థ (ఎల్ఐసీ)69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు జరిగే బీమా వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం డివిజన్ కార్యాలయం నుంచి వాక్‌ఫర్ ఎల్ఐసీ, ఎల్ఐసీ ఎంప్లాయిస్ హెల్త్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం డివిజన్, డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు, కోదండరామ్, విశ్వనాద్, వీరకిషోర్, తాతారావు, శిరీష, గన్నయ్య, సాయి శ్రీనివాసరావు, నాగబాబు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. అంతకు ముదుగా 5వ తరగతి విద్యార్థులకు కలరింగ్ పోటీలు, 6, 7తరగతుల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలతో పాటు ,6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 13 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

● మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మిథున్ రెడ్డిని దోషి అనడం సరికాదని, ఆయనను దోషిగా ప్రచారం చేస్తున్నారని, ఆరోపణలు చేసిన వారందరూ దోషులు కాదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డిని ధర్మాన ప్రసాదరావు, ఆలూరు ఎమ్మెల్యే విరూ పాక్షి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు బుధవారం ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం ధర్మాన మీడియాతో మాట్లాడుతూ దోషులని నిర్ధారించడం ప్రభుత్వం, పోలీసుల పని కాదన్నారు. అది న్యాయస్థానాలు చేయాలని చెప్పారు. ప్రభుత్వం కేసులుపెట్టిన వారందరూ దోషులనే భావన సమాజంలో ఉండాలని ప్రత్యర్థులు కోరుకుంటారన్నారు. అయితే రాజకీయాల్లో ప్రత్యర్థులను దోషులుగా చూపించ డానికి అధికారాన్ని ఉపయోగించే పరిస్థితి ఉందన్నారు. మిథున్ ధైర్యంగా ఈ రాష్ట్రంలో పరిస్థితులను ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కోర్టులో బెయిల్ వస్తుందనే అభిప్రాయం ఆయనకు ఉందన్నారు. ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని స్పష్టంచేశారు. వాళ్ల కుటుంబానికి చిత్తూరు జిల్లాలో, రాష్ట్రంలో మంచి పేరు ఉందని, సహజంగానే ప్రత్యర్థులకు కోపం ఉంటుందని, అయినా ఎదుర్కొంటామని సమస్య లేదన్నారు. ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుది కూడా అదే జిల్లా కాబట్టి మిథున్‌ని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనకు సంబంధమే లేని కేసు పెట్టి జైల్లో పెట్టారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పాలన పక్కన పెట్టి వైసీపీపై కేసులు పెట్టడం, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు.

బిక్కవోలులో లక్ష్మీగణపతికి హోమం

● పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు


బిక్కవోలులో లక్ష్మీగణపతిని దర్శిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి,మహాలక్ష్మి దంపతులు


ధవళేశ్వరంలో స్వామివారిని దర్శించుకుంటున్న సీఐ గణేష్

బిక్కవోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాలు బుధవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరాయి. ఈసదర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన శ్రీలక్ష్మీగణపతి హోమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ముందుగా లక్ష్మీగణపతికి ఎమ్మెల్యే దంపతులు పూజలుచేసి హోమంలో కూర్చున్నారు. చవితి ఉత్సవాల సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. వీరికి దిగవల్లి వెంకటేశ్వరరావు, బోడా రాంబాబు దంపతులు అన్నదాన ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షు డు చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పాలచర్ల శివప్రసాద్ చౌదరి, పల్లి రాజారెడ్డి, కొమ్మో జు శ్రీనివాస్, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

రంగంపేట(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో 'వినాయకచవితి' నవరాత్రులు సందర్భంగా బుధవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న సందర్భంగా అనపర్తి ఎమ్మె ల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మీ దంపతులు స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, జి.దొంతమూరు ఎన్డీయే కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రథంవీధి రాయల్స్ ఆధ్వర్యంలో..

ధవళేశ్వరం(ఆంధ్రజ్యోతి): రథంవీధి రాయల్స్ పేరిట యడ్ల వెంకటేష్ ఫ్రెండ్స్ సర్కిల్స్ ఆధ్వర్యంలో రథంవీధి గాంధీ బొమ్మ సెంటర్లో నెలకొల్పిన మండపంలో ఉన్న 9అడుగుల మట్టి వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. బుధవారం ఉదయం మండపంవద్ద వి.నాగ వరప్రసాద్ (రాజా) బ్రహ్మత్వంలో మహాగణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ అన్న సమారాధన కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 2వేలమంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రాజమహేంద్రవరంకల్చరల్(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టి.నగర్‌లో, శ్యామలా థియేటర్ వెనుక ఉన్న వినాయక పందిరి వద్ద బుధవారం అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చల్లా శంకరరావు, అనుశ్రీ సత్యనారాయణ, అధ్యక్షుడు జెల లక్ష్మణరావు, సెక్రటరీ వింటేజ్ ప్రసాద్, వానపల్లి గౌరీశంకర్, గీతా వెంకటేశ్వరరావు,హరిబాబు, కమిటీ మెంబర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ పీడీ అవార్డుకు యువరాజారెడ్డి ఎంపిక



బిక్కవోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న డి.యువరాజారెడ్డి జిల్లా ఉత్తమ పీడీ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన రాజమహేంద్రవరంలో ఈనెల 5న జరుగబోయే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకోనున్నారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అభినందనలు తెలిపింది.

ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థుల ల్యాబ్ ఆన్ వీల్స్

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ ప్రయోగాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంతి, ధ్వని, అయస్కాంతతత్వం, విద్యుత్‌క్షేత్రం తదితర దృగ్విషయాల పట్ల విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచడానికి వీలుగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమల లక్ష్మి తెలిపారు. భౌతికశాస్త్ర విభాగం అధ్యాపకులు, పీజీ విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వై.రాము, హైస్కూల్ హెచ్‌ఎం జీవీవీ గణపతిరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలభద్రపురం, కాపవరంలో ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు


బలభద్రపురం సొసైటీలో యూరియాను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బిక్కవోలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం, కాపవరం గ్రామాల్లోని సొసైటీలు, ఎరువుల షాపులపై బుధవారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో సొసైటీలతోపాటు, కాపవరం గ్రామంలోని శ్రీనివాసా, శ్రీరామావెంకట ఎరువుల షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో ఎరువుల స్టాకును పరిశీలించగా నిల్వల్లో స్వల్ప తేడాలు గమనించి రూ.40652ల విలువ గల ఎరువులకు అమ్మకాలు నిలిపివేయాలని రంగంపేట వ్యవసాయాధికారి శ్రీనివాస్ యజమానులను ఆదేశించారు. ఈతనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మధుబాబు మాట్లాడుతూ బిక్కవోలు మండలంలో సుమారుగా 55 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో వుందని, సొసైటీల్లో కూడా యూరియా అందుబాటులో వుందని ఎంఆర్‌పీ రేటు కన్నా అధిక ధరలకు యూరియా కొనుగోలు చేయరాదని సూచించారు. ఈతనిఖీల్లో అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎస్.లక్ష్మినారాయణ, ఎంపీఈవోలు కె.భాస్కరరెడ్డి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన


రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో డ్రైనేజీలలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. బుధవారం వాటిని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలలో డీసిల్టింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. మురుగునీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కాలువలలో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు వేయవద్దని స్థానిక ప్రజలకు సూచించారు.

గురుకుల కళాశాలకు ఇన్వర్టర్, ఫ్యాన్లు వితరణ

అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలకు అమరావతిజోన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది ఇన్వర్టరు, ఫ్యాన్లు, లైబ్రరీ కోసం జేఈఈ మరియు నీట్ పుస్తకాలను బహూకరించారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని బ్యాంకు సిబ్బంది కళాశాల ప్రిన్సిపల్‌కు అందజేశా రు. ఈ సందర్భంగా స్టేట్ యూనియన్ డీజీఎస్ పాపారావు మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల కళాశాలల ద్వారా అందిస్తున్న విద్యాబోధనకు తమవంతుగా సహాయం అందించామని అన్నారు. ఉపాధ్యక్షుడు పేరిశాస్త్రి, ఏజీఎస్ చంద్రశేఖర్, ఆర్ఎస్ అప్పారావు, రాజశేఖర్, మణికంఠ, ఎస్‌బీఐ మేనేజర్ రామాంజనేయులు, ప్రిన్సిపల్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

రాజానగరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ సూచించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అండ్ డ్రగ్స్ అబ్యూజ్ అనే అంశంపై బుధవారం జీజీ యూలోని విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ర్యాగి ంగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈసమా వేశంలో ఎస్.ఐ వంశీ అలె గ్జాండర్, ప్రొ వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎం ఎంఎస్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



బొజ్జగణపయ్యా.. వెళ్లిరావయ్యా!

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి బొజ్జగణపయ్య ఈ ఏడాదికి వెళ్లి.. మళ్లీ ఏడాది వస్తానంటూ నిమజ్జన ఘట్టానికి సిద్ధమయ్యాడు. గత నెల 27 నుంచి గణేష్ నవరాత్రులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ రోజున, 3, 5 రోజుల్లో నిమజ్జనాలు జరిగాయి. అయితే గురువారం 9వ రోజు కావడంతో నిమజ్జనాలు భారీ సంఖ్యలో ఉండే అవకాశం ఉంది. ఆదివారం గ్రహణం, రేపు శుక్రవారం కావడంతో గురువారం పెద్ద సంఖ్యలో నిమజ్జనానికి ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. బుధవారం 8వ రోజు కావడంతో నిజమజ్జనాలు దాదాపుగా జరగలేదనే చెప్పవచ్చు. జిల్లాలో 3 వేల విగ్రహాలను పోలీసుల వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదు చేసి ఏర్పాటు చేయగా, మరో 2 వేల విగ్రహాలు అనధికారికంగా ఉంటాయి. వీటిలో బుధవారం వరకూ వెయ్యి విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఇంకా మిగిలిన 4 వేల విగ్రహాల్లో అధిక శాతం గురువారం నిమజ్జనం చేసే అవకాశం ఉంది. విగ్రహాల ఊరేగింపులకూ భారీగానే సిద్ధమవుతుండడంతో ఇటు పోలీసులు కూడా భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిబంధనలు మీరవద్దు : ఎస్పీ

జిల్లాలో గణేష్ నిమజ్జనం, ఊరేగింపులను గూగుల్ మ్యాప్‌ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ నర సింహ కిశోర్ ఆదేశించారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలూ జరగకుండా తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమీక్షించారు.ట్రాఫిక్ అంతరా యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపరీ తంగా హోరెత్తించే సౌండ్ ఉండే డీజేలను అనుమ తించవద్దని ఆదేశించారు.పోలీసులు కేటాయించిన దారుల్లోనే నిమజ్జన వాహనాలు వెళ్లాలని సూచించా రు. పోలీసుల నిబంధనలు పాటించాలని, నిమజ్జన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు.

కళ్లు తెరిచే గణనాథుడు..

కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో 23 అడుగుల భారీ వినాయకున్ని ఏర్పాటు చేశారు. దర్శించుకోవడానికి వచ్చిన భక్తులను వినాయకుడు కనురెప్పలు మూస్తూ, తెరుస్తూ ఆశీర్వదిస్తూ అందరినీ అలరిస్తున్నాడు. - కొవ్వూరు



లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్..
గోదారి తగ్గుముఖం
ప్రమాదకరంగా భూగర్భజలాలు
8

జిల్లాలో కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జిల్లాలోని పలువురు నేతలకు నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టింది. వివిధ కార్పొరేషన్లకు జిల్లాకు చెందిన పలు వురిని డైరెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజమండ్రి రూరల్‌కు చెందిన వడగల వీర వెంకట బుచ్చిరాజును నియ మించింది. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనపర్తికి చెందిన బేరా వేణమ్మను నియమించారు. ఏపీ కుమ్మరి శాలివాన వెల్ఫేర్ అండ్ డెవల ప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజ మండ్రి రూరల్‌కు చెందిన పందూరి అప్పారావు, దలిపర్తి వేమన్నలను, నాటక అకాడమీ డైరెక్టర్‌గా రాజమండ్రికి చెం దిన గంగాలపల్లి వెంకటరమణ, రాజా నగరం నియోజకవర్గానికి చెందిన మ ద్దాల ఏసుపాదం, నిడదవోలుకు చెందిన వెలిగట్ల ఎస్‌వీఎ.లక్ష్మిని నియమించారు. ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజమండ్రికి చెందిన అఫ్సిర్ సయ్యద్, నిడదవోలుకు చెందిన షేక్ ముంతాజ్‌బేగం,ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ మిషన్ డైరెక్టర్‌గా కోరశిఖ చంద్రమౌళి (నిడదవోలు), ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ముత్యాల ప్రియ సౌజన్య(రాజమండ్రి)ని నియమించారు.

ప్రమాదకరమైన జ్వరం కాదు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజోతి) : జిల్లాలో ప్రస్తుతం నమోద వుతున్న జ్వరాల కేసులు అంత ప్రమా దకరం కాదని డీఎంహెచ్‌వో డా కె.వెం కటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి పీహె చ్‌సీని బుధవారం సందర్శించారు. జ్వర పీడితులు పెరిగితే ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ మార్పు వల్ల ప్రస్తుత కాలంలో రొంప, జలుబుతో జ్వరాలు, వంటి నొప్పు లతో కూడిన జ్వరాలు ఉన్నాయని వాటి కి మందులు ఉన్నాయని తెలిపారు. వేగేశ్వరపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ పరిశీలించారు.



శవాలతో బేరం!

జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌ల దందా

రాత్రి వేళ... మహా ప్రస్థానం కదుల

జిల్లా పరిధిలో ఎక్కడికైనా మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి నుంచి ఉచితంగా తరలించ డానికి మహా ప్రస్థానం వాహనాలు ఉన్నాయి. ఇవి ప్రభుత్వ ఆధీనంలో నడుస్తాయి. అయితే వీటిని రాత్రి వేళ అనుమతించరు. ఇది ప్రైవేటు అంబులెన్సులకు వరంగా పరిణ మించింది. మహా ప్రస్థానం వాహనాలు రాత్రి వేళల్లో నడపకపోయినా.. మృతదేహాన్ని మార్చురీలో ఉచితంగా భద్రపరచుకోవచ్చు. కానీ ఆ విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది ఉద్దేశపూర్వకంగానే బాధితులతో చెప్పరు. ఎక్కడా బోర్డులు ఉండవు.

అర్ధరాత్రి వేళ.. రంపచోడవరానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని కేవలం 53 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ ఊరికి తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్సుల వాళ్లు రూ.18వేల కిరాయి అవుతుందన్నారు. అంతే బాధితుల గుండె ఆగినంత పనైంది.

నగరానికి చేరువలో ఉన్న ఓ గ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఏకంగా రూ.6 వేల కిరాయి చెప్పగా సదరు కుటుంబీకుల వద్ద అంత మొత్తం లేకపోవడంతో ర్యాపిడో ఆటో పిలిపించుకున్నారు. అంతే.. ఆటో డ్రైవరు, బాధిత కుటుంబంపై కూడా అంబులెన్స్ డ్రైవర్లు దాడికి దిగారు. పోలీసులు కల్పించుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్‌ల తీరు చూసి రాబందులు కూడా ఆవేదన చెందుతున్నాయి. రాబందులకైనా కాస్త కనికరం ఉం టుందేమో కానీ ప్రైవేటు అంబులెన్సులకు వీసమెత్తు జాలి లేకపోవడంతో దోపిడీ తిష్ట వేసింది. జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద గేటు బయట రోడ్డుపై అటూ ఇటూ సుమారు 20 వరకూ ప్రైవేటు అంబులెన్సులు ఉంటాయి. రాత్రీపగలు ప్రైవేటు అంబులెన్సులు రాబం దుల అవతార మెత్తుతున్నాయి. డ్రైవర్లు ఆస్పత్రి ఉద్యో గుల సీట్లలో దర్జాగా కూర్చుని బేరాలకు ఎదురు చూస్తుంటారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి అటు ఏజెన్సీ, ఇటు హైవే వైపు నుంచి సుమారు 200 గ్రామాల ప్రజలు వేలాదిగా వస్తారు. హైవేను ఆనుకొని ఉండడం వల్ల ప్రమాద కేసులు రాత్రి వేళల్లో ఎక్కు వగా వస్తుంటాయి. ప్రతి రోజూ సుమారు 10 మర ణాల కేసులు నమోదవుతుంటాయి. ఇదే అదనుగా ఆస్పత్రిలో ఉద్యోగుల మాదిరిగా తిష్ట వేస్తున్న అంబు లెన్స్ డ్రైవర్లు దోపిడీకి తెరతీశారు.

స్కానింగ్ రాస్తే సంబరమే

ఎంఆర్ఐ, స్కానింగ్, ఎక్స్‌రే తదితర పరీక్షలకు ప్రభు త్వం దానవాయిపేటలోని ఒక ప్రైవేటు సంస్థతో ప్రభు త్వాస్పత్రి ఒప్పందం కుదుర్చుకుంది.ఇది కూడా ప్రైవేటు



ఆసుపత్రి సిబ్బందికి మామూళ్లు..

ఆస్పత్రిలో పగలూరాత్రి ప్రైవేటు అంబులెన్స్‌ల తం తు దారుణంగా మారిపోయింది. శానిటరీ సిబ్బంది, ఏఎన్ ఎంలు వంటి కిందిస్థాయి సిబ్బందితో అంబులెన్స్‌ల మాఫియా మీకింత మాకింత అనే స్థాయిలో సంబం ధాలు పెట్టుకొంది. ఎవరైనా చనిపోయినా, లేక కాసే పటిలో చనిపోతారనగా అంబులెన్స్‌ల డ్రైవర్లకు ఫోన్ వెళుతుంది. అంతే వాళ్లు నేరుగా లోపలికి వచ్చి బేరం కోసం ఎదురు చూస్తుంటారు. ఒకవేళ వీళ్లకు సమా చారం అందకుండా..మృతదేహాన్ని బయటికి తీసు కొస్తే చుట్టూ రాబందుల్లా మూగిపోతారు. కిరాయిలకు ఒక పద్ధతి, నిర్ధారణ లేకపోవడంతో వేల రూపాయల కిరా యి చెబుతారు. దాంతో అప్పటికే తమ వారు మృతి చెందిన బాధలో ఉన్న కుటుంబీకుల గుండె గుభేల్ మంటోంది. ప్రభుత్వాస్పత్రికి పేదవాళ్లే వస్తుంటారు. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిని దోపిడీ చేయడానికి బేరసారాలు సాగిస్తారు.

- ప్రైవేట్ అంబులెన్స్ రాబందులు
- అవసరం ఆసరాగా వేలల్లో కిరాయి
- పగలూరాత్రి రెచ్చిపోతున్న మాఫియా
- ఆస్పత్రి సిబ్బందికీ భాగస్వామ్యం
- కలెక్టర్ సెట్ చేయాలని వేడుకోలు

అంబులెన్స్‌లకు వరంగా మారింది. ఎవరికైనా వైద్యులు స్కానింగ్ రాస్తే ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లకు ఫోన్ వెళ్లిపోతుంది. వాళ్లు వచ్చి బేరాలకు దిగుతారు. రెండు కిలోమీటర్లు కూడా ఉండని దానవాయిపేటకు కిరాయి కనీసం రూ2 వేల నుంచి మొదలు పెడతారు. ఆస్ప త్రి కి మూడు అంబులెన్స్‌లున్నా లోకల్‌గా స్కానింగ్‌కి ప్రై వేటు అంబులెన్సులపై బాధితులు ఆధార పడడం చూ స్తుంటేమాఫియా వేళ్లూనుకుపోయినట్లు చెప్పకతప్పదు.

ఆటోలదీ అదే తీరు

ప్రభుత్వాసుపత్రి రోడ్డుకు అవతల ఆటో స్టాండ్ పెట్టారు. 20 ఆటోల వరకూ ఉంటాయి. వీళ్ల కూడా ఆస్పత్రి రోగులపై అజమాయిషీ చలాయిస్తున్నారు. రోగులను తీసుకెళ్లడానికి ఆసుపత్రి ఆవరణలోకి బయ టి నుంచి ఏదైనా ఆటో వస్తే వీళ్లందరూ ఆ డ్రైవరుపై ఒక్క ఉదుటున పడిపోతున్నారు. భయపెట్టి బయటకు పంపేస్తున్నారు. ఆటో స్టాండు ఉందని, బయటి నుంచి ఆటోలు రాకూడదని బెదిరిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సుల మాఫియా, ఆటోల దందా మితిమీరిపోయింది.పోనీ వీళ్లనే వినియోగించుకుందా మంటే వీరు చెప్పే కిరాయికి మృతదేహాన్ని వదిలి వెళ్లి పోవడమే బాధితులకు ఉండే ఏకైక మార్గం.పేదలు వైద్యానికి వచ్చే ప్రభుత్వాస్పత్రి వద్ద ఇంత దందా జరు గుతున్నా, పేదలు దోపిడీకి గురవుతున్నా తనిఖీలకు వచ్చే పాలకులకు, రోజూ ఇక్కడే విధులు నిర్వర్తించే అధికారుల చెవిన పడకపోవడం విస్తుగొలుపుతోంది. ఇప్పటికైనా కలెక్టర్ ప్రశాంతి దృష్టి సారించి ఈ మాఫి యాల నుంచి రక్షించాలని బాధితులు కోరుతున్నారు.

జేసీ చిన్న రాముడు బదిలీ

నూతన జేసీగా మేఘ స్వరూప్



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు బదిలీ అయ్యారు. ఆయ న స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న 2021 ఐఏఎస్ బ్యాచ్ అధికారి వై.మేఘ స్వరూప్‌ని ప్రభుత్వం నియమించింది. ఏడుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2018 ఐఏఎస్ బ్యాచ్‌నకు చెందిన చిన్న రాముడుకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. తదుపరి పోస్టింగ్‌కి సాధారణ పరి పాలన శాఖలో రిపోర్టు చేయాలని జీవోలో పేర్కొన్నారు.

స్పెషల్ టూరిజం హబ్‌గా రాజమండ్రి : దుర్గేష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూచనల మేరకు రాజమహేంద్రవరాన్ని స్పెషల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టులపై దృష్టి సారిస్తామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. సీఎం చంద్రబాబు వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సీఎంకి వివరిం చారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి ముందస్తుగా క్రూయిజ్‌రైజర్‌ని నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి సూచించగా చంద్రబాబు అంగీకరించారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా తీర్చిదిద్దుతున్న హేవలాక్ బ్రిడ్జిని త్వరితగతిన అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

3.30 లక్షల ఇళ్లకు కుళాయిలు : కలెక్టర్



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకం కింద ఇప్పటి వరకు 3.30 లక్షల గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. భారత ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ అదనపు జాయింట్ సెక్రటరీ సి.కమల్ కిషోర్ ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో దాదాపు 92 శాతం గృహాల వివరా లను ఐఎంఐఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లాలో 865 పాఠశాలలు, 868 అంగన్ వాడీ కేంద్రాలకు సురక్షతమైన మంచినీటి ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.144.38 కోట్లతో 431 పనులు పూర్తిచేసి పంచాయతీలకు అప్పగించామని, మరో రూ.24.75 కోట్లతో 48 పనులు పూర్తి కావడంతో త్వరలో వాటిని కూడా పంచాయతీలకు అప్పగిస్తామని తెలిపారు. పీఎం గతి శక్తి పథకం కింద జిల్లాలో 2,517 కిలోమీటర్ల పైపులైను నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,335 కిలోమీటర్లు పనులు పూర్తి చేసి డేటా అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లాలో జల్‌జీవన్ మిత్రలుగా ఐటీఐ, పాలిటెక్నిక్, పీఎం కెకెవైలలో శిక్షణ పొందిన యువతను నియమిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కార్పొరేషన్‌లో విలీనం కానున్న రూరల్ మండలం పరిధిలోని 10 గ్రామాలతో పాటు రాజానగరం మండల పరిధి దివాన్‌చెరువు, కడియం మండలం వేమగిరి పంచాయతీ కార్యదర్శులతో సుమారు 2 గంటల పాటు సమా వేశమయ్యారు.కార్యదర్శులకు పంచాయతీరాజ్ చట్టం, విధివిధానాలపై అవ గాహన కల్పించారు.హుకుంపేట, పిడింగొయ్యిలలో పెద్ద పెద్ద భవనాలు కనిపిస్తున్నాయి వాటికి ఎంత పన్నులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. విధులు సక్రమంగా నిర్వహించకుంటే క్షమించేదిలేదని హెచ్చరించారు.

యూరియా అందక..రైతుల ఆందోళన

తాళ్లపూడి, సెప్టెంబరు 3 (అంధ్రజ్యోతి) : యూరియా అందక రైతులు లబోదిబోమంటున్నారు. గజ్జరం, అన్నదేవరపేట సొసైటీల వద్ద యూరియా విక్రయాల్లో బుధవారం గందరగోళం నెలకొంది. పోరుగూరు రైతులు తమ గ్రామానికి వస్తుంటే గ్రామానికి చెందిన రైతులకు యూరియా ఎప్పుడు దొరుకుతుందని గజ్జరం గ్రామ రైతులు అంటున్నారు. అన్నదేవరపేట సొసైటీ పరిధిలో ఎక్కువ గ్రామాలుండగా తాళ్లపూడి, కుకునూరు, వీరభద్రపురం, పైడిమెట్ట గ్రామాల రైతులు తామెక్కడికి వెళ్లాలని యూరియా కోసం పోరాటం చేస్తున్నారు. రైతులకు అధిక సబ్సిడీపై అందిస్తున్న యూరియా ఆధారుకార్డుపై సరఫరా చేయడం చాలా తప్పని పొలం పాస్‌బుక్, కౌలుకార్డు ఆధారంగా మాత్రమే సరఫరా చేయాలంటున్నారు.

సారథ్యం యాత్ర విజయవంతం : నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రాజమహేంద్రవ రంలో సోమవారం నిర్వహించిన సారథ్యం యాత్ర విజయవంత మైందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రామవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడిగా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటి సారిగా రాజమహేంద్రవరం వచ్చిన పీవీఎన్ మాధవ్‌కు అపూర్వ స్వాగతం లభించిందన్నారు.తాను ఇచ్చిన పిలుపు మేరకు ఎస్‌టీ.రా జాపురం నుంచి రాజమహేంద్రవరం వరకు అనపర్తి కూటమి కార్యకర్తలు బైక్ ర్యాలీ చేశారన్నారు. సారథ్యం యాత్ర, బహిరంగ సభ కార్యక్రమాలను విజయవంతం చేసిన బీజేపీనాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



నామవరంలో పూర్తయిన టిడ్కో ఇళ్లు

ఇళ్లింతేనా!

నేటికీ టిడ్కో అయోమయం

ఎక్కడ చూసినా.. పెండింగ్

రాజమండ్రిలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కో ఇళ్లు నిర్మిం చారు. అందులో 5,574 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి.కానీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలా తక్కువ మంది మాత్రమే ఇళ్లల్లో ఉన్నారు. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. నిడదవోలులో 1755 ఇళ్లు శాంక్షన్ కాగా 1248 మొదలు పెట్టారు. కొవ్వూరు 480 శాంక్షన్ కాగా 480 మొదలు పెట్టారు. కానీ మధ్యలో ఆపేశారు. బొమ్మూ రులో మొదటి దశలో 2528 ఇళ్లు నిర్మించారు. తొర్రే డులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవ ళేశ్వరంలోని వడ్డిర కాలనీలో 256 నిర్మించారు. ఇందులో ఇప్పటి వరకూ బొమ్మూరులో నిర్మించిన ఇళ్లలో 2528 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా, 19 77 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు. బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. అక్కడ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయవలసి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులు పొందారు. ధవళేశ్వరం(వడ్డెర కాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్ప గించారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లల్లో 96 లబ్ధిదారులకు అప్పగించినా ఎవరూ రాలేదు. కేవలం ఒక్కరే నివాసం ఉంటున్నారు. రెండో దశలో నామ వరంలో 1104 ఇళ్లు, సింహాచల నగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1200 నిర్మించారు. ఇవి ఇంకా పూర్తి కాలేదు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. నిడదవోలులో 1755 శాంక్షన్ కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా జరగలేదు. ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపో యింది. కొవ్వూరు పట్టణం పరిధిలో పేదలకు 480 ఇళ్లు శాంక్షన్ కాగా 480 మొదలు పెట్టారు. ఇళ్ల నిర్మాణం జరిగినా, మౌలిక సదుపాయాలు కల్పిం చక పోవడంతో మొత్తం పెండింగ్‌లో పడింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్లు నిర్లక్ష్యానికి గుర య్యాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పగిస్తుందని ఎదురుచూసిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ పట్టణాలకు దగ్గరగా వేలాదిగా టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే. 2019 ఎన్నికలకు ముందే మొదటి దశ ఇళ్లను ఇవ్వడానికి సిద్ధం చేసింది. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలై.. వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టడం మొదలైంది. టిడ్కో గృహాలు ధ్వంసమ య్యా యి. రెండో దశలో ఆరంభించిన ఇళ్ల పరిస్థితి మరింత అధ్వానమైంది. వైసీపీ కేవలం టీడీపీ వేసిన రంగులు మార్చి..తన పార్టీ రంగులు వేయించిందే తప్ప మౌలిక సదుపాయాలు కల్పించలేదు. లబ్ధిదా ర్లకు అప్ప గించలేదు. నామవరంలో 1104 ఇళ్లను నిర్మించారు. వసతులు లేవు.. నిడదవోలు, కొవ్వూరు, నామవరం డి.బ్లాక్ ఎక్కడ చూసినా ఇదే సమస్య. తెలుగుదేశం కూటమి ఇటీవల మౌలిక సదుపాయాలు కల్పించ డానికి ముందుకొచ్చింది. కానీ కాంట్రాక్టర్లు, అధికా రులు పనులు ఆరంభించలేదు. ఈ పరిస్థితుల్లో వేలాది ఇళ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికే వాటి జీవిత కాలం సుమారు పదేళ్లు గడిచిపోయింది. ఈ అందమైన ఇళ్లను వెంటనే తమకు అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇవి ఇస్తే వేలాది మంది ఇంటి అవసరం తీరినట్టే. నామవరం ఇళ్లలో వినాయ కచవితి ముందు కూడా చోరీ జరగడం గమనార్హం. విద్యుత్ వైర్లు, కిటికీల వంటివి దోచుకుపోతున్నారు.





నామవరంలో చిట్టడవిలా రహదారి.. ఇంటికి అల్లుకున్న పొదలు

ఇళ్లలో పెరుగుతున్న చోరీలు

ఇప్పటికే నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అప్ప గించకపోవడంతో ఇళ్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వర్క్స్, ప్లంబింగ్ వర్క్సులకు సంబంధించిన మెటీరి యల్ చోరీకి గురవుతోంది.దొంగలు పడి ఇష్టానుసారం దోచుకుపోయారు. నామవరంలో రెండో దశలో నిర్మిం చిన 1104 ఇళ్లలో రూ.3 కోట్ల విలువైన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ మెటీరియల్ చోరీకి గురైనట్టు అక్కడి కాం ట్రాక్టు తరపు వ్యక్తులు చెబుతున్నారు. ఇటీవల వినాయక చవితి ముందు కూడా చోరీ జరగడం గమనార్హం. ప్రస్తుతం బొమ్మూరు మొదటి దశ, తొర్రే

- టిడ్కో ఇళ్లకు తప్పని తిప్పలు
- వైసీపీ వైఖరితో పాడైన ఇళ్లు
- నామవరంలో 1104 ఇళ్లకు చెదలు
- మోరంపూడిలో 224 అంతే
- నిడదవోలు,కొవ్వూరులో శిథిలం
- కూటమి ఇస్తుందని ఎదురుచూపులు
- వృథాగా ఉండిపోయిన వేలాది ఇళ్లు
- శిథిలస్థితికి చేరుకుంటున్న వైనం
- అధ్వానంగా టిడ్కో ఆవరణలు

డు, సింహాచలం నగర్ కాలనీలలో కొంతమంది లబ్ధి దారులు నివాసం ఉంటున్నారు. మిగతా చోట్ల కనీస మౌలిక సదుపాయాలు లేవు. నామవరం డి.బ్లాక్ వద్ద నిర్మించిన ఇళ్లలో 96 ఇళ్లను లబ్ధిదార్లకు అప్పగించినా ఒక్కరు మాత్రమే, వారైనా రాత్రి వేళ ఇంట్లో ఉంటు న్నారు. నిడదవోలు శ్లాబ్ కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించి తమకు ఇళ్లివ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కూటమి విజయంలో పవన్ కీలక పాత్ర

● జనసేన పార్టీ నియోజక వర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు


ప్రకాశరావుపాలెంలో వృద్ధులకు చీరలు పంచుతున్న దృశ్యం

నల్లజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి విజయంలో పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారని గోపాలపురం నియోజక వర్గ జనసేన పార్టీ కన్వీనర్ దొడ్డి గర్ల సువర్ణరాజు, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు అన్నారు. పవన్ పుట్టినరోజును పుర స్కరించుకుని ప్రకాశరావుపాలెంలో బుధవారం వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలనను కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాన్ విక్టర్‌బాబు, పార్టీ కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ, గడ్డె తిలక్, కొత్తపల్లి హరిబాబు, వీర మహిళలు సౌజన్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం


ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం 2025-27 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం బుధవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. అధ్యక్షుడిగా నాళం వీర వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శిగా కాకి అనిల్ సూర్య, కోశాధికారిగా కంకటాల రాంబాబు, ఇతర సభ్యులతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు వెలగ శ్రీరామ్మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో చిన్నిరామ సత్యనారాయణ, సత్యవరపు గోపాలకృష్ణ, మట్టే వీరవెంకట వరప్రసాద్, ఎంబీఎస్ ప్రసాద్, మద్దుల సత్యనారాయణ, మద్దుల నాని, గ్రంధి ప్రవీణ్, కొల్లేపర శ్రీనివాస్, కెజికె మోహన్, మన్యం వీరభద్ర గుప్తా, దేవతు ప్రసాద్, కొత్త రాజు, కొత్తమాసు వాసుదేవరావు, ఉప్పల కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్న కుమార్

నిడదవోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దృష్టిలోపం ఉన్న విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఉచిత నేత్ర వైద్యశిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని డాక్టర్ ప్రసన్న కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తుందన్నారు. అనంతరం కళాశాలలోని విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీ.ఏసురత్నం, విద్యార్థులు, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.25 వేలు విరాళం అందజేత


శ్యామలాదేవికి నగదు అందజేస్తున్న శ్రీనివాస్

దేవరపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ నిర్వహణకు దేవరపల్లికి చెందిన దాత అనిశెట్టి శ్రీనివాస్, ఆయన కుమారుడు ప్రసన్నకుమార్ రూ. 25 వేల నగదును ట్రస్ట్ నిర్వాహకురాలు శ్యామలాదేవికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి శ్యామలాదేవి కృతజ్ఞతలు తెలిపారు. అనిశెట్టి గంగరాజు, చిలకా సత్యనారాయణ, తుమ్మల వెంకట్రావు, పోతుల కనక రాజు, బళ్లా రాము, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియామకం

నిడదవోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురికి పదవులు వరించాయి. నాటక అకాడమీకి ఎస్‌డీఏ లక్ష్మి, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ముంతాజ్‌బేగం షేక్, ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ మిషన్‌కు చంద్రమౌళికి అవకాశం దక్కింది. వీరిని పలువురు అభినందించారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సత్యవతినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలో మున్సిపల్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 94 లక్షలతో చేపట్టిన ఆరు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ సాధారణ నిధులు రూ. 32.50 లక్షలతో 18వ వార్డు ఆర్‌ఆర్ టౌన్ షిప్‌లో చేపట్టిన సీసీ రోడ్డు, సత్యవతినగర్‌లో 6.50 లక్షలతో మంచినీటి సరఫరా పైపులైను, 10వ వార్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, జగనన్నకాలనీ - 4లో రూ. 7.50 లక్షలతో మంచినీటి పైపులైను, 15వ ఆర్థిక సంఘం నిధులతో 18వ వార్డు ఫైబర్‌నెట్ ఆఫీసురోడ్‌లో రూ. 18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, 14వ వార్డు బ్రిడ్జిపేటలో రూ. 14.50 లక్షలతో సీసీ అప్రోచ్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, జొన్నలగడ్డ శ్రీనివాస్, కమిషనర్ జీ.సందీప్, కౌన్సిలర్లు బత్తి నాగరాజు, కండెల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తగ్గుముఖం


గోష్పాదక్షేత్రం వద్ద తగ్గుముఖం పట్టిన నది

కొవ్వూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాలో కురుస్తున్న వర్షాలకు గత రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి కాస్త నెమ్మదించింది. నదీ పరీవాహక ప్రాంతాలలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నది నిలకడగా కొనసాగుతోంది. జూలై మొదటి వారం నుంచి గోదావరికి వరదలు రావడంతో ఏటిగట్లు నానిపోవడం వల్ల ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆ ప్రాంతీయులు కలవర చెందుతున్నారు. గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నాన ఘట్టాలు నెమ్మదిగా బయటపడుతున్నాయి.

ఆదర్శప్రాయురాలు ... టీచర్ కృష్ణవేణి


కృష్ణవేణి, ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్, పంగిడి

కొవ్వూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంగిడి జడ్పీ హైస్కూల్లో ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాచవోలు కృష్ణవేణి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నారు. 2023 మార్చిలో పది పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన తోట రేశ్వంత్‌కు రూ. 10 వేల నగదు, అలాగే 2024లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు రూ. మూడు వేలు చొప్పున, 2024-25లో పదోతరగతి చదువుతున్న 17 మంది విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తున్నారు.

తెలికిచర్లలో అశ్లీల నృత్యాలు

● ఆలస్యంగా వెలుగులోకి ...
● తమ దృష్టికి రాలేదన్న సీఐ బాలశౌరి


రికార్డింగ్ డ్యాన్స్ వేస్తున్న దృశ్యం

నల్లజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం తెలికిచర్లలో ఆదివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో భాగంగా జరిగిన ఊరేగింపులో మహిళలతో రికార్డింగ్ డ్యాన్స్ వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌పై మహిళలు అశ్లీలంగా వేసిన నృత్యాలను కొందరు యువ కులు సెల్‌ఫోన్‌లో బంధిస్తూ సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యింది. తెలికిచర్ల, కొత్తపేటలో రెండు చోట్లా రికార్డింగ్ డ్యాన్స్ జరగడంతో మండలంలో సంచలనమయ్యింది. మొన్న ఘంటవారిగూడెంలో జరిగిన సంఘటన మరువకముందే మరో సంఘటన జరగడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై నల్లజర్ల సీఐ బాలశౌరిని వివరణ కోరగా, తమ దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

● ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై అందజేత
● వర్తక సంఘం వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు


చాగల్లులో ఉత్తమ విద్యార్థులకు బహుమతుల అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి ,తదితరులు

చాగల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహించడంతో పాటు కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ, చదువులో రాణించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయం అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం రాత్రి సంపత్ వరసిద్ధి వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వర్తక సంఘం వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్తమ విద్యార్థులను శాలువాలతో సత్కరించి బహుమతులను అందజేశారు. ఇంటర్మీడియట్ ఎంపీసీలో అత్యధిక మార్కులు (931) సాధించిన వీ.పుష్పలక్ష్మికుమారికి మామిడి వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు ఊర్వశి స్టూడియో కుమార్ ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. బైపీసీలో అత్యధిక మార్కులు (905) మార్కులు సాధించిన కోడి లక్ష్మి లావణ్యకు కోట కృష్ణ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు సూర్యారావు ఏర్పాటు చేసిన బహుమతిని అందజేశారు. అలాగే పదోతరగతి తెలుగు మీడియంలో అత్యధిక మార్కులు (582) సాధించిన పడమటి కావ్యశ్రీకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నత్తా పరమ రాజేశ్వరరావు బహుమతిని అందజేశారు. 10వ తరగతిలో 977 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన టీ. సాయిసతీష్ వర్మకు లయన్స్ సభ్యుడు దొడ్డా వెంకటరావు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబును ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంది రాంబాబు, సభ్యులు జాను గంగారావు, పెంజర్ల గణేష్ , తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దమ్మెన్ను గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇటీవల బదిలీపై వెళ్లిన సందర్భంగా బుధవారం గ్రామ సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ వారిని సత్కరించారు. ఐదుగురు ఉద్యోగులకు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. అలాగే వీరికి నూతన వస్త్రాలు, పండ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయాలి


గౌరీపట్నంలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న జాన్‌పీటర్, తదితరులు

దేవరపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ప్రేమ, దయాగుణంతో సమాజ సేవ చేయాలని నిర్మలగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ జాన్‌పీటర్ అన్నారు. గౌరీపట్నంలో బుధవారం ఇండియన్ ఛారిటీమిషన్ ట్రస్ట్ దివ్యాంగ, వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, అనాథపిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు గాను వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుచేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ మేరకు నిర్వాహకులు డీఎస్‌వీడీ రావు, చైర్మన్ మధు, వైస్ చైర్మన్ కొమ్మర సత్తిబాబు, కోశధికారి అడబాల సంతోశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కౌరు శ్రీనివాస్, ఎంపీటీసీ ఉన్నమట్ల బ్రహ్మానందం, కామిశెట్టి శిరోమణి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లారీని వెనుక నుంచి టాటా ఏస్ ట్రక్కు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైనట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరి రావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. కడియంకి చెందిన మద్దూరు దుర్గా సురేష్ టాటా ఏస్ ట్రక్కు ఆటోలో ఈనెల 1వ తేదీన నల్లజర్ల బయలుదేరాడు. మార్గమధ్యలో కొవ్వూరు మండలం కాపవరం స్పీడ్ హైవేపై ఫ్లైఓవర్ దిగుతుండగా ముందువెళ్తున్న లారీ సడన్‌బ్రేక్ వేయడంతో ఆటో వెనుకనుంచి లారీని ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ దుర్గాసురేష్ రెండు కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

లక్ష్మీనారాయణ స్వామికి విశేష పూజలు



నిడదవోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లిలో వేంచేసివున్న లక్ష్మీ నారాయణ స్వామికి బుధవారం విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఏడు వారాలుగా వస్తూ 11 ప్రదక్షిణలతో స్వామివారిని దర్శించుకుంటున్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

పెరవలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకరపర్రు పరిధిలోని వ్యవసాయ భూములకు పంట నమోదు చేయించుకోవాలని ఆ గ్రామ ఉద్యాన అధికారి రోషిణి పేర్కొన్నారు. కౌలు రైతులు, సొంత రైతులు తమ పట్టాదారు పాసు బుక్‌లు జిరాక్సు ఆధార్‌కార్డు జిరాక్సు కాకరపర్రు సచివాలయానికి తీసుకురావాలన్నారు. దీనివల్ల ధాన్యం మద్దతు ధరకు అమ్ముకోవడం, పంట నష్టపోయినపుడు పరిహారం పొందడం, క్రాప్ ఇన్సూరెన్స్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి

తాళ్లపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో ప్రారంభించిన ఉచిత బస్సు పథకం మండలంలో పలుగ్రామాల ప్రజలకు ఫలితం లేకుండా పోయింది. అన్నదేవరపేట మీదుగా సర్వీసులు పునరుద్ధరించాలని పలువురు మహిళలు కోరుతున్నారు. అన్ని ప్రాంతాలకూ సర్వీసులు నడపకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తాళ్లపూడి మీదుగా ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెంకి పలు బస్సులు ఉండేవి. ఆ సర్వీసులు చాలా ఏళ్ల క్రితమే నిలిపేశారు. ప్రస్తుతం అన్నదేవరపేట మీదుగా ఒక్క సర్వీసూ లేదు. కాగా, స్త్రీ శక్తి పథకం వచ్చిన సందర్భంగానైనా ఆయా సర్వీసులు పునరుద్ధరించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెరవలి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఈనెల 4, 5 తేదీల్లో కొన్ని గ్రామాలకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ నారాయణ అప్పారావు తెలిపారు. అలాగే తీపర్రు ఫీడర్‌లో ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంట వరకు ఉండదన్నారు. అలాగే అజ్జరంలో 24 గంటలు విద్యుత్ పనులు చేస్తున్న కారణంగా అజ్జరం, వెంకటరాయపురం, సీతారామ్‌పురం, తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్‌ను మాత్రం ఉదయం 5 నుంచి తొమ్మిది గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు వరకు ఇస్తామన్నారు.

తగు మోతాదులో ఎరువులు వాడండి

● డివిజనల్ వ్యవసాయ శాఖ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

దేవరపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరి పంటకు ఎరువులు తగు మోతాదులో వాడాలని కొవ్వూరు డివిజనల్ వ్యవసాయ శాఖ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం బంధపురం, దేవరపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల నేల సారం కోల్పోతుందని, అందువల్ల సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. వరికి ద్రవరూపంలో ఉండే నానో యూరియా వాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తహశీల్దార్ వీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు భవనంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో వీఎస్ రామారావు మాట్లాడుతూ మండలంలో తొమ్మిది వేల మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు గర్తించామని చెప్పారు. వీరిలో మొదటి విడతగా 2200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 220 మంది వలంటీర్లను నియమించినట్టు తెలిపారు. ప్రతి వలంటీర్‌కు 10 మంది నిరక్షరాస్యులను కేటాయించి వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ టీ. బాల కోటయ్య, ఎంఈవో శారదాజ్యోత్స్న, రిసోర్స్‌పర్సన్ ఎల్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'దేశ ఆర్థికప్రగతిలో వ్యవసాయ రంగానిదే ప్రధాన పాత్ర'

చాగల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో దేశ ఆర్థికప్రగతిలో వ్యవసాయ రంగానిదే ప్రధాన పాత్ర అని సుంకవల్లి ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి వెంకన్న చౌదరి అన్నారు. మార్కొండపాడులో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎరువుల సమతుల్యతను సాధించడం కోసం కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించి, ఆ మేరకు యూరియా ధరను పెంచి ఎరువుల వాడకంలో సమతుల్యత సాధించవచ్చునని సూచించారు. దీనివల్ల పంటల దిగుబడి పెరిగి వ్యవసాయం మరింత లాభసాటి అవుతుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయానికి సాంకేతికను జోడించి శాస్త్రీయ విధానంలో సాగుచేసి లాభాలు సాధించవచ్చునన్నారు. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి 7.8 శాతం పెరిగిందని, వ్యవసాయ వృద్ధి 3.7 ఉందన్నారు. వ్యవసాయరంగం వాటా 15 శాతం కావడం హర్షణీయమన్నారు. అమెరికా సుంకాలు పెంచిన నేపథ్యంలో స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల ప్రపంచ దేశాలకు మంచి సాంకేతకంగా భావించవచ్చుని చెప్పారు.

ఉండ్రాజవరంలో 100 మందికి వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ఉండ్రాజవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉండ్రాజవరం క్రీస్తుప్రేమ సువార్త చర్చిలో గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన సన్ ఆసుపత్రి డాక్టర్ శోభాచరణ్ వచ్చి సుమారు 100 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఫెలోషిప్ అధ్యక్షుడు కె. షారోనురాజు, ఉపాధ్యక్షుడు టీ. అబ్బులు, కార్యదర్శి యోనాబాబు, కోశాధికారి సాల్మన్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించను


హుకుంపేటలో మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేశ్వరరావు

గోపాలపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వైద్యుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని వైద్యాధికారి కే.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందించే సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించి, త్వరలోనే వాటిని అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది రోగుల పట్ల సహృదయంతో మెలగాలన్నారు. జిల్లా ఏపీడీ యోగాలజిస్ట్ సుధీర్ బాబు, జాన్సన్, వైద్యాధికారిణి దుర్గాభవాని, సీహెచ్ఓ రూతమ్మ పాల్గొన్నారు.

ప్రమాద స్థాయికి భూగర్భ జలాలు


సమావేశంలో మాట్లాడుతున్న భూగర్భ జలాల శాఖ డీడీ శ్రీనివాస్

నల్లజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని, తక్షణమే నీటి సంరక్షణ పెంపు చేపట్టకపోతే... ఈ ప్రాంతం పంట భూములన్నీ ఎడారిగా మారే ప్రమాదముందని భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా వ్యవసాయ ఉద్యాన, నీటిపారుదలశాఖ అధికారులు సమావేశమై భూగర్భజలాల సంరక్షణ పెంపుపై సమావేశాన్ని నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ భూగర్భ జలమట్టాలు 20 అడుగుల నుంచి 50 అడుగుల లోతుకు తగ్గిపోయాయని , ఇది ఆందోళన కల్గించే అంశమన్నారు. ఇక్కడ వ్యవసాయమంతా బోరుబావులపైనే ఆధారపడి జరుగుతుంద న్నారు. ఏపీఎంబీసీ ఆధ్వర్యంలో వ్యవసాయం, తోటల పెంపకంలో డ్రిప్, స్ప్రింకర్లు వినియోగం వంటి అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మల్లిఖర్జున రావు, జిల్లా విజిలెన్స్ అధికారి రత్నకుమారి, నీటిపారుదలశాఖ డీఈ మనోజ్ కుమార్, మండల పరిషత్ ఏవో మహాలక్ష్మి ఏవో సోమశేఖర్,ఉద్యాన శాఖ అధికారిణి బబిత, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్ వ్యాన్

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు ...
మృతుడు సిక్కోలు వాసి



మృతుడు లక్ష్మణరావు (ఫైల్), ప్రమాదానికి గురైన వ్యాన్

దేవరపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొనడంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామానికి చెందిన జీరు అసిరినాయుడు, లక్ష్మీదంపతుల కుమారుడు లక్ష్మణరావు (నాని) 28 సంవత్సరాలు... నెల్లూరులో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈవెంట్ కోసం తన డ్యాన్స్ బృందం 11 మందితో కలిసి టాటా మ్యాజిక్ వ్యాన్‌లో బయల్దేరాడు. ఈ క్రమంలో కృష్ణంపాలెం ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న లారీని వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడం తో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. 10 ఏళ్ల నుంచి ఎంఎండీఎస్ పేరుతో లక్ష్మణరావు డ్యాన్స్ బృందాన్ని నడుపుతున్నాడు. స్వల్పగా యాలైన శ్రావణ్, కరిష్మా, హరిను హుటాహుటిన 108 వాహనంలో గోపాలపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. లక్ష్మణరావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.